


గేట్లు ఎత్తేవారేరీ..?

● సంగం, నెల్లూరు బ్యారేజీల నిర్వహణ గాలికి



నెల్లూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రూ.వందల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన నెల్లూరు, సంగం బ్యారేజీలను నిర్వహించేందుకు సిబ్బంది లేరు. ఇప్పటికిప్పుడు పెన్నాకు భారీ వరద వస్తే ఈ బ్యారేజీల వద్ద గేట్లు ఎత్తేవారు కూడా లేరు. గత టీడీపీ ప్రభుత్వంలో 90 శాతం పూర్తయిన ఈ రెండు బ్యారేజీల పనులను మిగిలిన పదిశాతం పూర్తి చేసేందుకు మూడేళ్లు సమయం తీసుకుంది. అయినా కొన్ని పనులు పెండింగ్ పెట్టి మరీ ఆర్భాటంగా రెండు బ్యారేజీలను నాటి సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. రెండు బ్యారేజీలు ప్రారంభమై రెండేళ్లు గడిచినా ఇంత వరకూ నిర్వహణకు మ్యాన్‌పవర్‌ను ప్రభుత్వం మంజూరు చేయలేదు. అదృష్టవశాత్తూ పెన్నాకు గడిచిన రెండేళ్లలో భారీ వరదలు రాలేదు కాబట్టి సరిపోయింది. ఒకవేళ వరదలు వచ్చి ఉంటే పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. సుమారు రూ.500 కోట్లతో నిర్మించిన నెల్లూరు, సంగం బ్యారేజీలను నెలకు రూ.10 లక్షలతో నిర్వహణ చేయలేక నిర్వీర్యం చేస్తున్నారు. సంగం బ్యారేజీలో 88 గేట్లు, నెల్లూరు బ్యారేజీలో 57 గేట్లు ఉన్నాయి. వీటిని ఆపరేట్ చేయాలంటే శిక్షణ పొందిన టెక్నికల్ సిబ్బంది అవసరం. ఆఖరుకు గతంలో ఉన్న లస్కర్లను కూడా వైసీపీ ప్రభుత్వం తొలగించడంతో ఇప్పుడు ఈ రెండు బ్యారేజీల వద్ద ఒక్కరు కూడా రెగ్యులర్ సిబ్బంది లేరు. ఒకరిద్దరికి అనధికారికంగా ఇరిగేషన్ అధికారులే జీతాలు ఇస్తూ ఈ బ్యారేజీల వద్ద కాపలా ఉంచారు. సంగం బ్యారేజీ నిర్వహణకు 28 మంది, నెల్లూరు బ్యారేజీ నిర్వహణకు 20 మంది అవసరమని ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి పలు మార్లు ప్రతిపాదనలు పంపారు. కానీ అనుమతులు మాత్రం రాలేదు. టెక్నికల్, నాన్ టెక్నికల్ సిబ్బంది లేకుండా ప్రాజెక్టులను ఎలా ఆపరేట్ చేయాలని ఇరిగేషన్ అధికారులు ప్రశ్నిస్తున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు అయినా ఈ సమస్యను పట్టించుకోవాలని అటు అధికారులు, ఇటు రైతులు కోరుతున్నారు.



సంగం బ్యారేజీ

నేడు సోమశిలకు సీఎం రాక

సోమవారం (నేడు) సీఎం చంద్రబాబు నాయుడు సోమశిల పర్యటన ఖరారు కావడంతో జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్‌లు ఆదివారం సోమశిలను సందర్శించారు. సీఎం రాక ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. హెలిప్యాడ్ కోసం అగ్రికల్చర్ కళాశాల, ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాల ప్రాంగణాలను పరిశీలించారు. గోనుపల్లి వద్ద మరో ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. సీఎం మధ్యాహ్నం 3:05గంటలకు గంటలకు సోమశిలకు చేరుకోనున్నారు. ఆగిన అప్రాన్, హైలెవల్ కాలువ పనులు, క్రస్టుగేట్ల వ్యవస్థను 4:45గంటల వరకు పరిశీలిస్తారు. అనంతరం గ్రామస్థులతో ముఖాముఖి నిర్వహించి ఇరిగేషన్ అధికారులతో సమీక్షిస్తారు. సాయంత్రం 5:45గంటలకు తిరుగు ప్రయాణమవుతారు.



సోమశిలలో హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్

పాలక మహాశయా.. పట్టించుకోవయ్యా!

పరిష్కారం కాని 'సమస్యలెన్నో?

జిల్లా వరప్రదాయిని సోమశిల జలాశయం పలు సమస్యలతో సతమతమవుతోంది. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఈ పరిస్థితి దాపురించింది. సాగునీటి రంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న సీఎం చంద్రబాబు సోమవారం సోమశిలకు రానున్న నేపథ్యంలో ఈ సమస్యలపై ఆయన దృష్టి సారించాలని జిల్లా రైతులు కోరుతున్నారు.

- సోమశిలపై గత ప్రభుత్వం నిర్లక్ష్యం
- అభివృద్ధి పనులకు పైసా విదిల్చని వైనం
- ప్రాజెక్టు మనుగడ ప్రశ్నార్థకం



అనంతసాగరం, ఆగస్టు 18: సోమశిలకు 2021,22 సంవత్సరాల్లో వరుసగా ఎగువ నుంచి భారీ వరద చేరింది. ఆ ప్రవాహాన్ని దిగువకు వదలడంతో జలాశయం ముందు డౌన్‌స్ట్రీమ్, అప్రాన్, పొర్లుకట్టలు, రక్షణ గోడలు, సోమేశ్వర ఆలయం పూర్తిగా ధ్వంసమయ్యాయి. వాటి అభివృద్ధిని అత్యవసరంగా చేయాల్సి ఉండగా, గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. అప్రాన్ పనులకు రూ. 99.11 కోట్లు మంజూరు చేయాల్సి ఉండగా, నిధులు విడుదల చేయని కారణంగా పనులు దక్కించుకున్న కాంట్రాక్టరు పత్తాలేకుండా పోయారు.

● ఆగిన హైలెవల్ కెనాల్ పనులు

ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో సాగునీటి సమస్యను పరిష్కరించేలా రూపొందించిన ఆనం సంజీవ్‌రెడ్డి హైలెవల్ కెనాల్ పనులు కునారిల్లుతున్నాయి. 2013లో ఈ పనులకు అంకురార్పణ జరిగింది. ఈ పనులు పూర్తయి ఉంటే మెట్ట గ్రామాల్లో తాగునీటి అవసరాలు తీరడంతోపాటు రైతుల జీవనోపాధి మెరుగుపడేది. గత వైసీపీ పాలనలో మొదటి ఫేస్ పనులు పూర్తి చేయకుండా రెండవ ఫేస్ పనులకు శ్రీకారం చుట్టారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు నీటి అవసరాలు తీరక అల్లాడుతున్నారు.

● ప్రమాదకరంగా క్రస్టుగేట్లు

సోమశిల ప్రాజెక్టు క్రస్టుగేట్లు అధ్వానంగా ఉన్నాయి. మొత్తం 12 క్రస్టుగేట్లు ఉండగా 11వ నెంబరు గేటు రోప్ తుప్పుపట్టి తెగిపోయేలా ఉంది. 12వ గేట్ పరిస్థితి కూడా అలాగే ఉన్నట్లు తెలుస్తోంది. ఇక గత వరదల సమయంలో 3,5 నెంబర్ల క్రస్టుగేట్లు మొరాయించాయి. గత ఐదేళ్ల పాలనలో గేట్ల రోప్‌లకు గ్రీజు కూడా పూయలేదు. వాటి మెయింటనెన్స్‌కు నిధులు విడుదల చేయలేదు. ఈక్రమంలో రాబోయే వర్షాకాలంలో ప్రాజెక్టు గేట్లతో ఎలాంటి ప్రమాదం జరగుతుందోనని ఇంజనీర్లు ఆందోళన చెందుతున్నారు.

బలహీనంగా పొర్లుకట్టలు

ప్రాజెక్టు పరిధిలో పొర్లుకట్టలు బలహీనంగా ఉన్నాయి. గత వరదల సమయంలో ఉత్తర, దక్షిణం వైపు ఉన్నా రివెట్‌మెంట్ నిర్మాణాలు దెబ్బ తిన్నాయి. వాటి స్థానంలో తాత్కాలిక పనులు చేసి చేతులు దులుపు కొన్నారు. అలాగే జలాశయం వద్ద సిబ్బంది కొరత వెంటాడుతుంది.



అధ్వానంగా సోమశిల ఉత్తర కాలువ

క్రస్టుగేట్లకు ఉన్న పాతరోప్

కాలువల అభివృద్ధి శూన్యం

ప్రాజెక్టు పరిధిలోని నాన్‌డెల్టా ఉత్తర, దక్షిణ కాలువ మనుగడ అధ్వానంగా ఉంది. కాలువకు డబ్లింగ్ పనులకు డిజైన్ చేశారు. ఉత్తర కాలువను 750 క్యూసెక్కుల నుంచి 1500 క్యూసెక్కులకు పెంచి కొంత మేరకు పనులు చేసి వదిలేశారు. చేసిన పనులకు గత ప్రభ్వుతం నిధులు విడుదల చేయలేదు. దీంతో ఏటా రెండవ పంట సమయంలో జరగాల్సిన పనులకు బ్రేక్ పడింది. కాలువల అభివృద్ధి లేక చివరి ఆయకట్టుకు నీరు సరఫరా కాని పరిస్థితి. తెలుగుగంగ వరద కాలువ నీటి ప్రవాహ సామర్థ్యం 11,500 క్యూసెక్కులు కాగా, కండలేరుకు నీటి సరఫరా సమయం ఆలస్యమతోంది. ఈకాలువ రెట్టింపు సామర్థ్యం పనులు కూడా పూర్తి చేయలేదు.

ట్రాఫిక్ ఎస్‌ఐ X టీడీపీ మహిళా నేత

- ఆటో డ్రైవర్ డ్రంకన్ డ్రైవ్ విషయంపై వివాదం
- ఇద్దరి మధ్య ఘర్షణ, పరస్పర దాడి
- జీజీహెచ్‌లో ట్రాఫిక్ ఎస్‌ఐ, 'నారాయణ'లో రేవతికి చికిత్స

నెల్లూరు,(క్రైం),ఆగస్టు18: ట్రాఫిక్ ఎస్‌ఐకి, టీడీపీ మహిళా నేతకు మధ్య జరిగిన వివాదం తారస్థాయికి చేరుకొని, ఒకరిఒకరు దాడి చేసుకున్నారు. స్థానికుల కథనం మేరకు, నగరంలోని రంగనాయకులస్వామి ఆలయానికి వందమీటర్ల దూరంలోఆదివారం సాయంత్రం ఏడు గంటల సమయంలో ఓ ఆటోను నిలిపి వేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గమనించిన ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్ ఆటో వద్దకు వెళ్లి చూడగా, ఎవరూ లేరు. ఆ సమయంలో ఆటోడ్రైవర్ వచ్చి ఆటోను తీసేస్తాను సార్ .. అంటూ చెప్పాడు. అయితే ఆటోడ్రైవర్ నుంచి మద్యం వాసన రావడంతో వెంటనే ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్ విషయాన్ని ట్రాఫిక్ ఎస్‌ఐ గీతారమ్యాకు తెలియజేశాడు. దీంతో ఆమె అక్కడికి చేరుకొని ఆటోడ్రైవర్‌తో డ్రంకన్‌డ్రైవ్ టెస్ట్ చేయించారు. అనంతరం ఆటోను స్టేషన్‌కు తరలిస్తుండగా, డ్రైవర్ అడ్డుకున్నాడు. అనంతరం ఆటో డ్రైవర్ సంతపేటకి చెందిన టీడీపీ కార్యకర్తలకు, నాయకులకు ఫోన్ చేశాడు. దీంతో ఆ ప్రాంతానికి టీడీపీ కార్యకర్తలతోపాటు నాయకురాలు రేవతి చేరుకున్నారు. వారు వచ్చాక అక్కడ ఏమి జరిగిందో ఏమో తెలియదు కానీ, ట్రాఫిక్ ఎస్‌కి, రేవతికి మధ్య ఘర్షణ జరిగింది.ఈ ఘర్షణలో ఇద్దరూ గాయపడ్డారు. అనంతరం ట్రాఫిక్ ఎస్‌ఐ గీతారమ్యా జీజీహెచ్‌కి, రేవతి నారాయణ ఆసుపత్రికి చికిత్స కోసం వెళ్లారు. ఈ ఘర్షణపై పరస్పర ఆరోపణలు చేసుకున్నారు.

● కోటంరెడ్డి పరామర్శ

గాయపడిన టీడీపీ మహిళా నేత రేవతి నారాయణ వైద్యశాలలో చికిత్స పొందుతుండగా, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి ఆదివారం రాత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడి విషయమై పూర్తి స్థాయిలో విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మస్తాన్, అంచూరి శ్రీనివాసులునాయుడు, ఇక్బాల్, తదితరులు పాల్గొన్నారు.



రేవతిని పరామర్శిస్తున్న కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి



చేతికైన గాయాన్ని చూపుతున్న ఎస్‌ఐ గీతా రమ్య

కల్పవృక్షంపై వెంకయ్యస్వామి

వైభవంగా ఆరాధనోత్సవాల ప్రారంభం



కల్పవృక్ష వాహనంపై విహరిస్తున్న వెంకయ్య స్వామి

వెంకటాచలం, ఆగస్టు 18: మండలంలోని గొలగమూడి వెంకయ్యస్వామి 42వ ఆరాధనోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేకువన సుప్రభాతసేవ, అభిషేకం, స్వామివారిపూజ, హారతి, ప్రసాద వినియోగం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తికి అభిషేకం, దత్త సంప్రదాయ షోడపచార పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారి సమాధి మందిరాన్ని పూలతో అత్యంత సుందరంగా అలంకరించారు. అనంతరం ఉదయం 10 గంటలకు గొలగమూడి గ్రామస్థుల ఆధ్వర్యంలో సర్వభూపాల వాహన సేవ నిర్వహించారు. గ్రామోత్సవం ముందు భక్తుల కోలాటాలు, పండరి భజనలు సాగాయి. ఆరాధనోత్సవాల్లో మొదటిరోజు కావడంతో ఉభయకర్తల తోపాటు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గ్రామస్థులు భక్తులకు అన్నదానం చేశారు. ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం కార్యక్రమాలను పర్యవేక్షించారు.

● కల్పవృక్షవాహనంపై వెంకయ్యస్వామి

ఆదివారం రాత్రి వెంకయ్యస్వామి కల్పవృక్ష వాహనంపై కొలువుతీరి భక్తులకు దర్శనమిచ్చారు. గొలగమూడి గ్రామస్థులు ఉభయకర్తలుగా వ్యవహరించిన ఈ సేవకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించిన వాహనంపై ఊరేగుతున్న వెంకయ్య స్వామివారిని చూసి తమ జన్మధన్యమైనట్లు భక్తులు పులకించి పోయారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కాగా ఆరాధనోత్సవాల్లో రెండోరోజైన సోమవారం ఉదయం 10 గంటలకు వెంకయ్య స్వామికి సూర్యప్రభ వాహనసేవ, రాత్రికి చంద్రప్రభ వాహన సేవ నిర్వహించనున్నారు.

ప్రేమానురాగాలకు ప్రతిరూపం

సోదర సోదరీ ప్రేమకు నిదర్శనం

దేశ సంస్కృతికి తార్కాణం

నేడు రాఖీ పౌర్ణమి

నెల్లూరు (విద్య), ఆగస్టు 18: సోదర ప్రేమకు ప్రతిరూపంగా నిలిచే రక్షాబంధన్ సంప్రదాయమైన విలువలను మరింత ఉట్టిపడేలా చేస్తుంది. ఉన్మాదం, విచక్షణారహితం వంటి వెకిలి చేష్టలు పేట్రేగిపోయి, మానవతా విలువలు మంటగలుస్తున్న నేటి ఆధునిక యుగంలో రాఖీ పౌర్ణిమ తన విశిష్టతను చాటుతూ సోదర ప్రేమ పటిష్టతకు దోహదపడుతుంది. శ్రావణ పౌర్ణమి లేదా రాఖీ పూర్ణిమ రోజున అక్కాచెల్లెళ్లు తమ అన్నదమ్ముల నుదుటన తిలకం దిద్ది, చేతికి రాఖీ కట్టి మిఠాయిలు తినిపిస్తారు. సోదరులు కూడా తమ శక్తి కొద్దీ కానుకలు ఇస్తారు. సోదరులు దూరప్రాంతాల్లో ఉంటే రాఖీలను పోస్టులోనూ కొరియర్‌లోనూ పంపుతారు. గతంలో రాఖీ పండుగను హిందువులు, సిక్కులు మాత్రమే జరుపుకునేవారు. సోదరీమణులు కూడా తమ సొంత అన్నదమ్ములకు మాత్రమే రాఖీ కట్టేవారు. కానీ ఈ సంప్రదాయం ఇప్పుడు దేశంలో అన్ని మతాలకు విస్తరించింది. అలాగే సొంతవారికే కాకుండా తమ ఇష్టాన్ని బట్టి అన్నదమ్ముల వరసయ్యే వారికి కూడా రాఖీ కడుతున్నారు. ఆగస్టు 19 (నేడు) రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక కథనం.

● అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక

భారతీయ సంస్కృతికి నిదర్శనంగా కుటుంబ బాంధవ్యాలలోని మాధుర్యానికి చిహ్నంగా ఈ పండుగను జరుపుకుంటారు. మనకు అనేక పండుగలు ఉన్నాయి. శ్రావణమాసంలో నోములు, వ్రతాలు, పూజలతో ప్రతి ఇల్లూ కళకళలాడుతుంది.ఈ మాసంలో ప్రతితిథికి ఒక ప్రత్యేకత ఉంది. సోదరీ, సోదరులకు విశేషమైన రోజుగా గుర్తించబడింది రక్షాబంధనం. రక్ష కట్టించుకుంటే అరిష్టాలను పోగొడుతుందని, ప్రతి సోదరుడు తన సోదరికి రక్షగా ఉండాలన్న ఉద్దేశంతోనే ఈ పండుగ జరుపుకుంటార ని చరిత్ర చెబుతోంది.

● రాఖీ కట్టే సమయం

శ్రావణ పౌర్ణమి రోజున మధ్నాహ్న సమయంలో రాఖీ కట్టాలని శాస్త్రాలు చెబుతున్నాయి. ఆ తర్వాత నేరు తీపిచేయడం సంప్రదాయం. మనం చేసే ప్రతి పనికీ కర్మసాక్షి ఆ సూర్యభగవానుడు. మధ్నాహ్నవేళ సూర్యకిరణాల తాకిడి ఎక్కువగా ఉంటుంది. అంతటి తేజస్సు రాఖీలో ఇమిడి ఉంటుందని, ఆ సమయంలోనే రాఖీని కట్టించుకోవాలని శాస్త్రం చెబుతుంది. ఇదిలా ఉండగా పెళ్లి అయిన ఆడపడుచులు తమ పుట్టింటికి వెళ్లి సోదరులకు రాఖీలను కట్టడం ఆనవాయితీగా వస్తున్నది.



నెల్లూరులో రాఖీలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

పురాణాల్లో, చరిత్రలోనూ రక్ష

రక్షాబంధనమనేది కేవలం అన్నాచెల్లెల్లు, అక్కాతమ్ముళ్లు కట్టుకునేది కాదు. రక్షాబంధనం ద్వారా రక్ష కల్పించాలనే ప్రతిజ్ఞ, ఆత్మీయులకు భరోసా కల్పించడం కోసమని శాస్త్రం చెబుతోంది. పూర్వం రాజవంశీకులకు ఇబ్బందులు, ప్రమాదాలు కలుగుతాయనే కారణంగా వాటి నుంచి రక్షణ పొందడానికి కట్టుకునే ఆనవాయితీ నుంచి ఈ రక్షాబంధనం వచ్చినట్లు చరిత్ర కథనం. గతంలో భర్తకి రక్షణ కోసం భార్య రాఖీ కట్టేది. దేవదానవ యుద్ధంలో ఇంద్రుడికి విజయం కలగాలని శచీదేవి రక్ష కడుతుంది. చరిత్రలో పురుషోత్తముడితో తలపడడానికి సిద్ధంగా ఉన్న అలెగ్జాండర్ భార్య రుక్సానా బేగం పురుషోత్తముడి ఆశ్రయం కోరుతుంది. అతడికి సోదరి లేదన్న విషయం తెలుసుకుని శ్రావణ పౌర్ణమి రోజున రాఖీ కడుతుంది. అందుకు బహుమతిగా తన భర్త ప్రాణాలను కాపాడమని కోరుతుంది. తన చేతికి ఉన్న రక్ష కారణంగా అలెగ్జాండర్‌ను చంపకుండా వదిలేస్తాడు పురుషోత్తముడు. అంతటి విశిష్టత కలిగిన రాఖీ పండుగను నేటి యుగంలో కూడా మహిళలు వైభవంగా జరుపుకుంటున్నారు.



ఎక్కడున్నా రాఖీ రోజు కలుస్తాం

- కుంచాల తబిత, ధనలక్ష్మీపురం

రాఖీ పండుగంటే నాకు చాలా ఇష్టం. ఆ రోజు మా అన్న వినయ్‌కి రాఖీ కట్టాలని ఎంతో ఆశగా ఎదురుచూస్తుంటా. నేను చదువుల కోసం బయట ఉన్నాను. మా అన్న కూడా ఉద్యోగం చేస్తూ బయట ప్రాంతాల్లో ఉన్నాడు. కానీ రాఖీ పౌర్ణమి రోజు ఎంత ముఖ్యమైన పనులున్నా సరే ఇంటికి వచ్చేస్తాం. ఇప్పటి వరకు రాఖీకట్టకుండా ఒక్కసారి కూడా లేను. చిన్ననాటి నుంచి ఎంతో అన్యోన్యంగా కలిసి పెరిగాం. ఏ సమస్య వచ్చినా ఒకరికొకరం చెప్పుకుని పరిష్కరించుకునే వాళ్లం. రాఖీ మా బంధాన్ని మరింత బలోపేతం చేసింది.



కష్టసుఖాలను పంచుకుంటాం..

అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని నిత్యం గుర్తుకు తెచ్చుకుంటాం. కష్టమైనా, సుఖమైనా నేను, నా సోదరి ఇద్దరం కలిసి పంచుకుంటాం. మా అమ్మ విజయలక్ష్మి మృతి చెందాక ఒకరినొకరం ఓదార్చుకున్నాం. పెళ్లిళ్లు అయి వేర్వేరుగా జీవిస్తున్నప్పటికీ అదే వాత్సల్యాన్ని కొనసాగిస్తున్నాం. ప్రతి రక్షాబంధన్ రోజున కలుసుకుంటాం. ఒకరికొకరు రక్ష కట్టుకుంటాం.

- దేవిరెడ్డి సువర్చన్‌రెడ్డి, శ్రీతులసి,కోవూరు



సోదరి ప్రోత్సాహంతో ఉన్నతిస్థితికి..

ఓసీలకు ఉద్యోగాలు రావని మా నాన్న నన్ను ఇంటర్‌లో చదువు మాన్పించి బెంగళూరులో ఉన్న బంధువుల వద్దకు కాంట్రాక్ట్ పనుల కోసం పంపాడు. అప్పటికే వివాహమైన మా అక్క వెంకట రమణ ఈ విషయం తెలుసుకుని నా తమ్ముడ్ని నేను ఇంజనీర్‌గా చూడాలని.. మా నాన్నతో గొడవపడి నన్ను ఇంటికి పిలిపించింది. సోదరి ప్రోద్బలంతో ఎంటెక్ పూర్తి చేశా. నేడు ఉన్నత ఉద్యోగంలో స్థిరపడ్డా. రక్షాబంధన్ వచ్చిందంటే సోదరి తప్పక వచ్చి నాకు రాఖీ కడుతుంది. ఈ సారి పోస్టులో రాఖీ పంపింది.

-కే రామకృష్ణారెడ్డి, వెంకటేశ్వరపురం, సంగం



రాఖీ కోసం ఎదురు చూస్తున్నా

- మౌనిక, గౌతమ్

నా తరువాత తమ్ముడు గౌతమ్ పుట్టాడు. చిన్నతనం నుంచే వాడి అల్లరి, చిలిపితనం భరిస్తూనే అమ్మ తరువాత అక్కగా ప్రేమను పంచా. చిన్నతనం నుంచే రాఖీ పండుగ వచ్చిందంటే దాచుకున్న డబ్బుతో రాఖీ కొని తమ్ముడికి కట్టేదాన్ని. పెళ్లై తొమ్మిది సంవత్సరాలు అవుతున్నా రాఖీ పండుగ కోసం ఏటా ఎదురు చూస్తుండేదాన్ని. ఉన్నత చదువులకు చెన్నైకి వెళ్లినా తమ్ముడికి పోస్టు ద్వారా రాఖీ పంపిన సందర్భాలు ఉన్నాయి. ఉద్యోగ రీత్యా తమ్ముడుగౌతమ్ ప్రస్తుతం బెంగళూరులో ఉంటున్నాడు. ఈ సంవత్సరం కొరియర్ ద్వారా రాఖీ పంపా.



పెన్నానదిలో సాగుచేస్తున్న వేరుశనగ పంట

పెన్నా పోరంబోకు భూముల ఆక్రమణ

● కలెక్టరుకు వీఆర్వో ఫిర్యాదు

విడవలూరు, ఆగస్టు 18: ముదివర్తి గ్రామ సమీపంలో పెన్నా పోరంబోకు భూములు ఆక్రమణకు గురై పంట పొలాలుగా మారుతున్నాయి. దీనివలన పెన్నా పరీవాహక ప్రాంతాలు వర్షాలు వచ్చినప్పుడు ముంపునకు గురవుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముదివర్తి గ్రామ సమీపంలో సర్వేనెంబరు 1011లో సుమారు 400 ఎకరాల పెన్నా పోరంబోకు భూములు ఉన్నాయి. ఈ భూముల్లో పంటలు సాగుచేసుకునేందుకు రెవెన్యూ అధికారులు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. అయినా గ్రామానికి చెందిన కొందరు భూములను ఆక్రమించుకుని వేరుశనగ, వరి పంటలు సాగుచేస్తున్నారు. అక్రమార్కులకు రెవెన్యూ, ట్రాన్స్‌కో శాఖల అధికారులు చేయూతనివ్వడంతో పెన్నాలో ఆక్రమణల పర్వం కొనసాగుతోందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

● **పెన్నా భూములకు పాసు పుస్తకాలు**

పెన్నా పరీవాహక భూములకు చట్టప్రకారం అడంగళ్లు, ఒన్‌బీ పాస్ పుస్తకాలు ఇవ్వకూడదు. అయితే ఆక్రమిత భూములకు రెవెన్యూ అధికారులు ఒన్‌బీలు జారీ చేసినట్లు, సుమారు 150 ఎకరాలకు డిజిటల్ సైన్ ఇచ్చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆక్రమణదారులు ఈ భూములను లక్షల రూపాయలకు విక్రయించడమే కాకుండా ఎకరా రూ. 25వేల చొప్పున లీజుకి ఇచ్చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా పెన్నా పోరంబోకు భూముల్లో విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటుచేసేందుకు రెవెన్యూ అధికారులు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. అయినా విద్యుత్ సర్వీస్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

● **జిల్లా కలెక్టరుకు వీఆర్వో ఫిర్యాదు**

ముదివర్తి గ్రామ సమీపంలో ఉన్న పెన్నా భూములకు రెవెన్యూ అధికారులు అడంగల్లు, ఒన్‌బీలు ఇస్తున్నారని స్థానిక వీఆర్వో దయానందం ఈనెల 16న జిల్లా కలెక్టరుకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. 150 ఎకరాలకు రెవెన్యూ అధికారులు డిజిటల్ సైన్ ఇచ్చారని, అంతేకాకుండా కొన్ని పాస్ పుస్తకాలను జారీ చేశారని, దీనిని ఆసరాగా చేసుకుని ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారని, ఈ వ్యవహారంపై జిల్లా అధికారులు స్పందించి తగిన విచారణ జరపాలని ఆయన కోరారు.

పారిశుధ్య కార్మికులపై దాడి

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 18: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో రోడ్డుపై చెత్తసేకరిస్తున్న నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులు బుర్రా జయరామయ్య, గుండెపోగు చెంచయ్యలపై శనివారం అర్ధరాత్రి ఐదుగురు స్థానిక యువకులు దాడిచేయడంతో వారికి గాయాలయ్యాయి. ఈమేరకు బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఉదయం పారిశుధ్య కార్మికులు విధులను బహిష్కరించగా, నగర కమిషనర్ రమణబాబు ఈ విషయాన్ని ఎమ్మెల్యే, డీఎస్పీకి తెలిపారు. దాడులు చేసినవారిపై చర్యలకు ఆదేశించడంతో విధుల్లోకి వెళ్లారు. అలాగే ఓ మూగ నాయీ బ్రాహ్మణ యువకుడిపై కూడా యువకులు దాడిచేశారు. బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ దాడిని స్థానిక టీడీపీ నాయకులు, స్థానిక ప్రజలు తీవ్రంగా ఖండించారు. కాగా, పారిశుధ్య కార్మికులు జయరామయ్య, చెంచయ్యలపై దాడిచేసిన నక్కా సురేంద్ర, నక్కా రమణయ్యలపె కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

రామాపురంలోని దుకాణంలో చోరీకి యత్నం

● సీసీ కెమెరాలో రికార్డు

వరికుంటపాడు, ఆగస్టు 18: రామాపురం పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి సమీపంలోని ఓ దుకాణం వద్ద ఆదివారం దొంగలు బీభత్సం సృష్టించడంతో ప్రజలు హడలిపోయారు. తెల్లవారుజామున మోటారుబైకుపై వచ్చిన ఇద్దరిలో ఓ వ్యక్తి దుకాణం షెట్టర్‌కు వేసిన తాళం పగులకొట్టేందుకు విశ్వ ప్రయత్నాలు చేసి విఫలం అయ్యాడు. రోజు మాదిరిగా ఉదయం దుకాణానికి వెళ్లిన యజమాని పరిస్థితిని గమనించి సీసీ టీవీని పరిశీలించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. అలాగే కాకొల్లువారిపల్లికి వెళ్లే మార్గంలోని అంకాళమ్మ ఆలయం సమీపంలోని మోటారుబైకు దగ్ధమయ్యింది చూస్తుంటే పరిస్థితి ఏవిధంగా ఉందో తేటతెల్లమవుతుంది. ఇటీవల కాలంలో పలు గ్రామాల్లో దొంగల తాకిడి అధికమవడంతో ఏ సమయంలో ఎలాంటి పరిస్థితులు దాపురిస్తాయోనని ప్రజలు భయాందోళనతో ఉన్నారు. పోలీసులు నిఘా వ్యవస్థను పటిష్ఠం చేసి దొంగతనాలు జరుగకుండా చూడాలని కోరుతున్నారు.



సీసీటీవీలో నమోదైన నిందితుడి చిత్రం

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

నెల్లూరు(క్రైం), ఆగస్టు18: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను నవాబుపేట పోలీసులు ఆదివారం భగత్‌సింగ్ కాలనీ వద్ద స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా నవాబుపేట సీఐ అన్వర్‌బాషా మాట్లాడుతూ అక్రమాలకు పాల్పడే వారిని వదిలిపెట్టే సమస్యే లేదన్నారు.

నేటి ఎస్పీ గ్రీవెన్స్ రద్దు

నెల్లూరు(క్రైం), ఆగస్టు18: సీఎం నారా చంద్రబాబు నాయుడు ఉమ్మడి నెల్లూరు జిల్లా పర్యటన దృష్ట్యా సోమవారం జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను రద్దు చేస్తున్నామని పోలీసు కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది.

ప్రేమ ఫలించలేదని యువతి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), ఆగస్టు 18: నెల్లూరు నగరంలోని ముత్యాలపాలెంలో ఆదివారం ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ముత్యాలపాలెంలో నివాసం ఉంటున్న వెంకటరమణకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్ద కుమార్తె జీవిత(19) పదో తరగతి వరకు చదువుకొని ఇంటి వద్దనే ఉంటోంది. ఆమెకు ఇన్‌స్టా గ్రామ్‌లో రామ్మూర్తినగర్‌కు చెంది ప్రతాప్‌తో పరిచయ మై ప్రేమగా మారడంతో కొంతకాలం క్రితం ఆమె అతనిని వివాహం చేసుకోమని కోరింది. అయితే అతను కాలయాపన చేస్తూ వచ్చాడు. దీంతో ఆమె మనస్థాపానికి గురైంది. ఆదివారం వెంకటరమణ దంపతులు తమ చిన్నకుమార్తెకు అనారోగ్యంగా ఉండటంతో ఆమెను తీసుకొని వైద్యశాలకు వెళ్లారు. ఈ క్రమంలో జీవిత తన ఇంట్లోని ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వైద్యశాల నుంచి ఇంటికి వచ్చిన దంపతులు కుమార్తె ఉరి వేసుకుని ఉండటాన్ని గమనించి బాలాజీనగర్ పోలీసులకు సమాచారం అందించారు. బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ కె.సాంబశివరావు, ఎస్ఐ మహబూబ్ సుభానిలు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

నృసింహుడి సేవలో పుదుచ్చేరి హోంమంత్రి

రాపూరు, ఆగస్టు 18: మండలంలోని పెంచలకోన లక్ష్మీనరసింహస్వామిని ఆదివారం పుదుచ్చేరి హోం మినిస్టర్ ఓం నమఃశివాయం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధానార్చకులు పూర్ణాహుతితో స్వాగతం పలికారు. అనంతరం శ్రీవారి కల్యాణం మండపం వద్ద వేదాశీర్వచనాలు చేసి, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అలాగే పూర్వపు జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు కూడా కుటుంబం సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు.



పుదుచ్చేరి హోంమంత్రికి స్వామివారి చిత్రపటం అందచేస్తున్న ఆలయ ఈవో

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	123
లేయర్ లైవ్	100
స్కిన్ చికెన్	222
స్కిన్‌లెస్	244
లేయర్	170

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6667
వెండి కిలో ధర	రూ. 83,300
వెండి ఒక గ్రాము	రూ. 85.30

వసూళ్లే లక్ష్యం.. సేవలు శూన్యం!



● అన్నదాతను మరచిన మార్కెట్ కమిటీలు ● రుసుముల రూపేణా రూ.కోట్లలో వసూలు

● రైతులను పూర్తిగా విస్మరించిన వైసీపీ ప్రభుత్వం

నెల్లూరు (వ్యవసాయం), ఆగస్టు 18: రైతులకు ఉపయోగపడాల్సిన వ్యవసాయ మార్కెట్ కమిటీలు (ఏఎంసీ) కేవలం వసూళ్లకే పరిమితమయ్యాయి. అన్నదాతలకు ఉపయోగపడాల్సిన నిధులు గత పాలకుల అస్తవ్యస్త నిర్ణయాలతో పక్కదారి పడుతున్నాయి. జిల్లాలో 8 ఏఎంసీలు ఉండగా, వీటి పరిధిలో 21 రుసుము వసూళ్ల కేంద్రాలు ఉన్నాయి. వీటితోపాటు ఏఎంసీలలో గోదాముల అద్దెలు, పంట ఉత్ప త్తుల నిల్వల ద్వారా ఏటా రూ.కోట్లలో ఆదాయం వస్తోంది. కానీ కర్షకులకు మాత్రం ఉపయోగపడటం లేదు.

● **రైతును విస్మరించిన గత ప్రభుత్వం**

గిట్టుబాటు ధర లభించనప్పుడు రైతులకు వడ్డీలేని రుణాలను అందించే రైతుబంధు పథకాన్ని గత వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది. 2014-19లోని టీడీపీ హయాంలో ఈ పథకానికి కొంత నగదును కేటాయించేది. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ నిధులను ఇతర అవసరాలకు వినియోగించింది. దీంతో రైతులు, పశువుల ఆరోగ్య సేవల శిబిరాలు నిలిచిపోయాయి. పొలాల నుంచి ప్రధాన రహదారుల వరకు గ్రావెల్ రోడ్ల ఊసేలేదు. కనీసం ప్రతిపాదనలు కూడా లేకుండా పోయాయి.

● **ముందుకు రాని కాంట్రాక్టర్లు**

రుసుముల రూపంలో మార్కెట్ కమిటీలకు ఆదాయం వస్తున్నా కనీస అవసరాలు, వసతులపై దృష్టి పెట్టడం లేదు. కొన్ని పనులకు అధికారులు టెండర్లకు ఆహ్వానిస్తున్నా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. గత ప్రభుత్వం చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. దీనివల్ల యార్డుల్లో కనీస వసతులు లేకుండా పోయాయి. కావలిలో రహదారి విస్తరణ పనుల్లో ప్రహరీ గోడను కూల్చేశారు. దాదాపు నాలుగేళ్లుగా టెండర్లకు పిలుస్తున్నా ఎవరూ ముందుకు రాలేదు. రాపూరు, సర్వేపల్లిలోని ఏఎంసీ కార్యాలయ భవనాల పరిస్థితి కూడా అంతే. ఇంకా ఏఎంసీల పరిధిలోని గోదాముల సాధారణ నిర్వహణకు టెండర్లు ఆహ్వానిస్తున్నా కనీస స్పందన లేదు.

● **రూ.కోట్లలో ఆదాయం**

జిల్లాలోని 8 మార్కెట్ కమిటీల ద్వారా రుసుము రూపంలో రూ.కోట్లలో ఆదాయం వస్తోంది. 2019-20లో రూ.28.40 కోట్ల వసూళ్ల లక్ష్యం కాగా రూ.24.65 కోట్ల వసూళ్లు వచ్చాయి. 2020-21లో రూ.31.14 కోట్లకుగాను రూ.11.22 కోట్లు, 2021-22లో రూ.32 కోట్లకు రూ.23.45 కోట్లు, 2022-23లో రూ.20.30 కోట్లకు దాదాపు రూ.34.42 కోట్లు, 2023-24లో రూ.35.03 కోట్లకు దాదాపుగా రూ.32.51 కోట్లు వసూళ్లయినట్లు సమాచారం. అయితే ఈ నిధులను వైసీపీ సర్కారు ఇతర అవసరాలకు వినియోగిస్తూ రైతుల మేలును పూర్తిగా విస్మరించింది. తాజాగా 2024-25కు సంబంధించి రూ.34.43 కోట్ల రుసుముల వసూళ్ల లక్ష్యం నిర్ణయించారు. నెల్లూరు ఏఎంసీకి రూ.5.14 కోట్లు, కోవూరుకు రూ.9.67 కోట్లు, కావలికి రూ.5.84 కోట్లు, కందుకూరుకు రూ.3.78 కోట్లు, రాపూరుకు రూ.1.25 కోట్లు, ఆత్మకూరుకు రూ.3.65 కోట్లు, ఉదయగిరికి రూ.2.8 కోట్లు, సర్వేపల్లికి రూ.2.3 కోట్ల లక్ష్యం ఉంది.

ఎస్టీ వర్గీకరణ చేయాలి

● ఏపీ యానాది గిరిజన ఉద్యోగుల సంఘం

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 18 : ఎస్సీ వర్గీకరణతో పాటు ఎస్టీ వర్గీకరణ కూడా చేయాలని ఏపీ యానాది గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బూదూరు కేశవరామ్ కోరారు. ఆదివారం నగరంలోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో ఆ సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీ వర్గీకరణ చేసి యానాదులకు న్యాయం చేయాలని కోరారు. ఎస్టీ వర్గీకరణకు సంబంధించి అన్ని సంఘాలను కలుపుకుని ఐక్యకార్యాచరణ ప్రకటించాలని తీర్మానించామన్నారు. అందరు ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులను కలిసి విన్నవించాలని తీర్మానించామన్నారు. జిల్లాలోని అనేక ప్రభుత్వ శాఖల్లో పదోన్నతుల్లో రిజర్వేషన్లు సమక్రమంగా అమలు చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మలికి చెంచయ్య మాట్లాడుతూ గిరిజన నిరుద్యోగ యువతకు అన్ని పోటీ పరీక్షలకు కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు చేవూరు సుబ్బారావు, జిల్లా నాయకులు యాత్రాసి మురళి, యోగీశ్వర్, వెంకటేష్, సుధాకర్, రామమోహన్, కృష్ణయ్య, వాసు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్టీ వర్గీకరణ చేయాలని ఆందోళన చేస్తున్న నాయకులు

సోమశిలలో 23.734 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, ఆగస్టు 18: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి ఆదివారానికి 11066 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్యాం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.734 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ డెల్టా, ఉత్తర, దక్షిణ కాలువలకు 210 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

రేపు విశ్రాంత ఉద్యోగుల సమావేశం

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 18 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమావేశం ఈనెల 20న సాయంత్రం 5 గంటలకు నగరంలోని టౌన్‌హాల్లో జరుగుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఐ.లక్ష్మీనారాయణ, కార్యదర్శి పి.వెంకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులందరూ హాజరు కావాలని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి జూనియర్ ఎడ్ల బండ్ల పందెం పోటీలు

● మొదటిస్థానంలో గంగపట్నం గిత్తలు

అల్లూరు, ఆగస్టు 18: స్థానిక పీజీఎం యూత్ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్రస్థాయి జూనియర్ ఎడ్ల బండ్ల పందెం పోటీలను నిర్వహించారు. ఈ పందెంలో ఇందుకూరుపేట మండలం గంగపట్నంకు చెందిన చాముండేశ్వరి సీఫుడ్స్‌కు చెందిన ఎడ్ల జత ప్రథమస్థానంలో నిలిచి రూ20,116, విడవలూరు మండలం ముదివర్తికి చెందిన తలారి భావికకు చెందిన ఎడ్ల జత రెండస్థాయిలో నిలిచి రూ15,116 గెలుచుకున్నారు. మూడోస్థానంలో బోగోలు మండలం మల్లాయపాలెంకు చెందిన అత్తిరాజుల లాస్యకు చెందిన ఎడ్ల జత రూ10,116, విడవలూరు మండలం ముదివర్తికి చెందిన నన్నం చరణ్‌కు చెందిన ఎడ్ల జత నాలుగో స్థానంలో నిలిచి రూ7,116, బోగోలు మండలం మల్లాయపాలెం మన్నవరపు రాజేష్‌కు చెందిన ఎడ్ల జత ఐదో స్థానంలో రూ5,116 నగదుతో పాటు బహుమతులను పొందారు. కార్యక్రమంలో పీజీఎం యూత్ సభ్యులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న పీజీఎం యూత్ సభ్యులు

కిటికీలో ఇరుక్కపోయన వానరం

● రక్షించిన వైద్యుడు కుమార్

ఆత్మకూరు, ఆగస్టు 18 : ఆ చిన్న కోతి(వానరం)కి ఆకలేసిందో లేక దాని చేష్టలతో అలా చేసిందో తెలియదు కాని ఆత్మకూరులోని వెంకటేశ్వర ప్రజా వైద్యశాలలోని భవనంలోకి వెళ్లింది. తిరిగి బయటకు వెళ్లేందుకు కిటికీలో నుం చి వెళ్లేందుకు ప్రయత్నించి దానికి ఉన్న ఇనుప రాడ్‌ల మధ్య ఇరుక్కపోయింది. బయటకు వెళ్లేందుకు ఎంత ప్రయత్రించినా దాని వల్ల కాలేదు. అందులో నుంచి రాలేక కేకలు పెడుతూ ఉంది. అటువైపు వెళ్లేవారు దాన్ని రక్షించాలని ఉన్నా కరుస్తుందనే భయంతో ధైర్యం చేసి ముందుకు వెళ్లడం లేదు. వైద్యశాల సిబ్బంది చూస్తూ ఉండిపోయారు. ఇది గమనించిన ఆస్పత్రి వైద్యుడు కుమార్ వచ్చాడు. కోతి వద్దకు వెళ్లి టవల్ సహాయంతో దాన్ని నెమ్మదిగా బయటకు తీసి వదిలేశారు. దీంతో కోతి ఆనందంగా బయటకు పరుగులు తీసింది. చిన్న ప్రాణాన్ని కాపాడిన డాక్టర్ కుమార్‌ను పలువురు అభినందించారు.



కోతిని రక్షిస్తున్న డాక్టర్ కుమార్

వైద్యురాలిపై అత్యాచారం దారుణం

● జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా ● జూడాల బైక్ ర్యాలీ

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 18 : కోల్‌కతాలో డ్యూటీలో ఉన్న ట్రైనీ వైద్యురాలిపై అమానుషంగా దాడి చేసి అత్యాచారం, హత్య చేసిన వారు ఎతంటి వారైనా కఠినంగా శిక్షించాలని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా డిమాండ్ చేశారు. కోల్‌కతా ఘటనకు నిరసనగా ఆదివారం రాత్రి జూడాలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి ఆర్‌టీసీ బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మస్తాన్‌బాషా మాట్లాడుతూ ఈనెల 9వ తేదీన కోల్‌కతాలో ఓ వైద్యురాలిపై దాడి జరిగినా ఇంత వరకు పూర్తిస్థాయిలో నిందితులను పట్టుకోలేదన్నారు. ఇలాంటి సంఘటన జరగటం మొత్తం వైద్య ప్రపంచాన్నే కలవర పెడుతుందని ఆదోళన వ్యక్తం చేశారు. వైద్యులకు రక్షణ కల్పించేలా ప్రత్యేక చట్టాలు తీసుకు రావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ జూనియర్ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జునాయిద్ ఆలీ అహ్మద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పీరస్ జోయల్, కార్యదర్శి డాక్టర్ హితేష్ యాదవ్, ఉపాధ్యక్షులు డాక్టర్ ఉత్తమ్‌కుమార్, డాక్టర్ రాజ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులు డాక్టర్ తేజస్వీని, డాక్టర్ అబిద్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లు

● **ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల నిరసన**

ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం గాంధీబొమ్మ వద్ద కొవొత్తుల నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్ మాట్లాడుతూ ఇతర దేశాలలో మహిళల పట్ల ఎవరైనా అరాచకం చేస్తే ఎలా శిక్షిస్తారో మన దేశంలోనూ అలాంటి శిక్షలే వెయ్యాలన్నారు. ఆసుపత్రిలో డ్యూటీలో ఉన్న ట్రైనీ వైద్యురాలిపై సభ్యసమాజం తలదించుకునే విధంగా నిందితులు ప్రవర్తించిన తీరు తీవ్రంగా కలిచి వేస్తుందన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా మాట్లాడుతూ దేశానిక స్వాతంత్ర్య వచ్చి 78 ఏళ్ల అయినా దేశంలో ఇలా హత్యాచారాలు జరగటం తలదించుకోవాల్సిన విషయమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యులు షాన్‌వాజ్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్ అహ్మద్, ఏఐవైఎఫ్ నాయకులు సర్ధార్, బాదుల్లా, గౌస్‌బాషా, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కదాడిలో చిన్నారికి గాయాలు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 18: మండలంలోని శకునాలపల్లి పంచాయతీలోని యర్రబల్లిగడ్డ సెంటర్‌లో ఈర్ల అర్చన(10)పై ఆదివారం కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. యర్రబల్లిగడ్డ సెంటర్‌లో కుక్కల సంచారం అధికమైందని, గత రెండు రోజులుగా చిన్నారులు, మహిళలపై దాడి చేస్తుండడంతో భయబ్రాంతులకు గురవుతున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల కలేనా?

ప్రతి మండలానికో ప్రభుత్వ జూనియర్ కళాశాల. ప్రతి నియోజకవర్గానికి ఓ డిగ్రీ కళాశాల. పేద విద్యార్థులందరికీ అందుబాటులో ప్రభుత్వ విద్య... అనే ప్రభుత్వ ఆశయాలు ఆచరణలో అమలు కావడం లేదు. లేదు. జిల్లా కేంద్రమైన నెల్లూరులోనే ఇంతవరకు ఒక్క ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేదు. నెల్లూరు పట్టణం మొత్తానికి కేపీసీ జూనియర్ కళాశాల ఒక్కటే అందుబాటులో ఉంది. డీకేడబ్ల్యూ కళాశాల కేవలం మహిళలకే పరిమితం కావడంతో పేద విద్యార్థులకు ప్రైవేట్ కళాశాలలే దిక్కయ్యాయి. జిల్లా పరిధిలో కేవలం 12 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, ఉదయగిరి, విడవలూరు, కోవూరు మినహా మరెక్కడా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఎక్కడా లేవు. సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలో ఒక్క ప్రభుత్వ జూనియర్ కళాశాలకానీ, ఒక్క డిగ్రీ కళాశాలకానీ లేకపోవడం గమనార్హం.

● ఎడ్యుకేషన్ హబ్‌గా కావలి
● అయినా ఒక్క ప్రభుత్వ కళాశాల లేని వైనం
● విధిలేక ప్రైవేట్ కళాశాలలే పేదలకు దిక్కు
● ఫీజు చెల్లించలేక ఇబ్బందులు

కావలిటౌన్, ఆగస్టు 18 : మొదటి నుంచి ఎడ్యుకేషన్ హబ్‌గా చెప్పుకునే కావలి పట్టణంలో ఒక్కటంటే ఒక్కటి కూడా ప్రభుత్వ కళాశాల లేదు. కావలి పరిసర ప్రాంతాల్లోని సుమారు 20 మండలాలకుపైగా విద్యార్థులు కావలికి వచ్చి విద్యనభ్యసిస్తుంటారు. కావలి విద్యాప్రదాత దొడ్ల రామచంద్రారెడ్డి విశ్వోదయ విద్యాసంస్థల (ఎయిడెడ్)ను స్థాపించి లక్షలాదిమంది పేద విద్యార్థుల జీవితాల్లో జ్ఞానజ్యోతులు వెలిగిం చారు. అయితే గత ప్రభుత్వంలో ఎయిడెడ్ కళాశాలల్లోని పోస్టులను రద్దు చేయడంతో ఎయిడెడ్ కళాశాలలు నిర్వీర్యమైపోయాయి. ఈ క్రమంలో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న జవహర్ భారతి కళాశాలలు, నెల్లూరు వీఆర్ కళాశాల, సర్వోదయా కళాశాల కూడా ప్రాభవం కోల్పోయాయి.



కావలి పట్టణ వ్యూ

● **ప్రైవేట్ కళాశాలలే దిక్కు**

గత ప్రభుత్వం ఎయిడెడ్ కళాశాలల ఎయిడ్ రద్దు చేసి అధ్యాపకులు, సిబ్బందిని ప్రభుత్వ కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు బదిలీ చేసింది. దీంతో ఎయిడెడ్ కళాశాలల మనుగడ ప్రశ్నార్థకమైంది. దీంతో పేద విద్యార్థులు విధిలేక ప్రైవేట్ కళాశాలల్లో చేరి అధిక ఫీజులు చెల్లించుకుంటున్నారు. పేద, దిగువ మధ్య తరగతి కుటుంబాల వారు ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లో ఫీజులు చెల్లించలేక చదువుకు స్వస్తి పలుకుతున్నారు.

బకాయిలు చెల్లించరూ!

● పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్లకు ఏడాదిగా అందని జీతాలు
● కూటమి ప్రభుత్వంలో చెల్లిస్తారని ఎదురుచూపు



సీతారామపురం: బస్టాండ్ సెంటర్‌లో చెత్తను సేకరిస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

సీతారామపురం, ఆగస్టు 18: స్వచ్ఛ భారత్ కింద గ్రామ పంచాయతీల ఆర్థిక ఆదాయాన్ని పెంచేందుకు 2014లో టీడీపీ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చెత్త నుంచి సంపదను తయారీ చేసేందుకు కేంద్రాలు నిర్మించింది. అందులో భాగంగా అధికారులు మండలంలో 14చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలకు చెత్తను తరలించేందుకు 40మంది గ్రీన్ అంబాసిడర్లను నియమించారు. వీరికి గ్రామ పంచాయతీ నుంచి ఒక్కొక్కరికి నెలకు రూ.6వేలు అందించేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రీన్ అంబాసిడర్స్‌కు ఏడాదిగా నుంచి జీతాలు అందించలేదు. వీరు జీతం కోసం ఎదురు చూస్తున్నారు. గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులను కూడా అప్పటి ప్రభుత్వం వెనక్కి తీసుకోవడంతో పంచాయతీ మనుగడ ప్రశ్నార్థకంగా సాగింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం చెత్త నుండి సంపద సృష్టించడంపై ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఇటీవల సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రభుత్వం ఆశించిన ఫలాలు పొందాలంటే క్షేత్రస్థాయిలో పని చేయాల్సిన గ్రీన్ అంబాసిడర్లకు కూటమి ప్రభుత్వం బకాయి జీతాలపై చెల్లించేందుకు దృష్టి సాధిస్తే బాగుంటుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కుటుంబ పోషణ భారమైంది...

గత 9ఏళ్ల నుంచి సీతారామపురం పంచాయతీలో గ్రీన్ అంబాసిడర్‌గా పనిచేస్తున్నా. గత ప్రభుత్వంలో సమయానికి వేతనాలు చెల్లించక పోవడంతో కుటుంబ పోషణ భారంగా సాగింది. అయినా పనులు చేశాం. సంపద కేంద్రాలను వైసీపీ ప్రభుత్వం పర్యవేక్షణ చేయక, నిధులు మంజూరు చేయకపోవడంతో అవి పూర్తిగా నిర్వీర్యం అయ్యాయి. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పెండింగ్ బకాయిలను విడుదల చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.



\- కలివెల ప్రభాకర్, గ్రీన్ అంబాసిడర్

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



గంగిరెడ్డిపల్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 18: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అల్లర్లు సృష్టించేందుకు యత్నిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. ఆదివారం గంగిరెడ్డిపల్లి, గానుగపెంటపలి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ స్నేహపూర్వకంగా మెలిగి ప్రశాంతత వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేయాలన్నారు. అపరిచిత వ్యక్తుల సంచారంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్న సమస్యలు వస్తే వివాదాలకు దిగి ఘర్షణలు చేసుకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ఎలాంటి సంఘటనలు చోటుచేసుకున్న పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ఉదయగిరి రూరల్, ఆగస్టు 18: కృష్ణంపల్లిలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్ర ఆలయంలో భక్తులు ఆదివారం విగ్రహాలు, ధ్వజస్తంభం, శిఖర కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు హోమాలు, తదితర ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామి కల్యాణంను శాస్త్రోక్తంగా చేపట్టారు. ధ్వజ స్తంభాన్ని క్రేన్ సహాయంతో ఏర్పాటు చేసేటపుడు గ్రామ స్థులతో పాటు బంధువులు, సమీప గ్రామాల ప్రజలు తరలిరావడంతో ఆలయం వద్ద సందడి నెలకొంది. ఈ సందర్భంగా కొందరు స్వామివారికి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్నదాన, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



క్రేన్ సహాయంతో ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేసిన భక్తులు

కలువాయి: వెదనపర్తి కోదండరామస్వామి ఆలయంలో ఆదివారం గ్రామస్థులు స్వామి వారి నూతన విగ్రహం, శిఖర కలశ ప్రతిష్ఠను చేపట్టారు. ఈ సందర్భంగా మహాకుంభాభిషేకం నిర్వహించారు. వేడుకలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచు దనియాల చంద్రయ్య నాయుడులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను సన్మానిస్తున్న నాయకులు

విద్యాభివృద్ధికి పెద్దపీట



ఎస్ఎంసీ చైర్మన్‌ను సన్మానిస్తున్న చెంచలబాబు యాదవ్

ఉదయగిరి రూరల్, ఆగస్టు 18: కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెట్టపీట వేస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ తెలిపారు. ఆదివారం స్థానిక చెంచురామయ్య అతిథిగృహంలో నూతనంగా ఎంపికైన పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లు భాస్కర్‌రెడ్డి, బాలఅంకయ్య, మధుయాదవ్, కాలేషాలను సన్మానించి అభినందించారు. గత ప్రభుత్వంలో గాడి తప్పిన విద్యావ్యవస్థను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి విద్యాభివృద్ధికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వం విద్యా పథకాలకు మహనీయుల పేర్లు పెట్టడం అభినందనీయమన్నారు. నూతనంగా ఎంపికైన ఎస్ఎంసీ చైర్మన్లు పాఠశాలల అభివృద్ధికి చర్యలు చేపట్టడంతో పాటు విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న, నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, రమణారెడ్డి, రమణయ్య, అంబటి మస్తాన్, బాలకృష్ణ పాల్గొన్నారు.

నిర్వహణ నిధులు కేటాయించక..

● తుప్పుపట్టి నిరుపయోగంగా మారిన జనరేటర్ ● పట్టించుకోని అధికారులు
● ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయంలో దుస్థితి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 18: మండల తహసీల్దారు కార్యాలయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ఉండేందుకు పదేళ్ల క్రితం పాలకులు జిల్లాలోని అన్ని మండలాలకు జనరేటర్లు కేటాయించారు. వాటి నిర్వహణకు ప్రత్యేక బడ్జెట్ కల్పించక పోవడంతో అధికారులు వాటి నిర్వహణను గాలికొదిలేశారు. దీంతో రూ.లక్షలు వెచ్చించి సమకూర్చిన యంత్రాలు, సామగ్రి అలంకారప్రాయంగా దర్శనం ఇస్తున్నాయి.



ఆరుబయట ఉన్న తహసీల్దారు కార్యాలయంలోని జనరేటర్

నీరుగారిన లక్ష్యం: అప్పట్లో విద్యుత్ కోతలు అధికంగా ఉండడంతో పాటు తుఫాన్ల సమయంలో వీచే గాలులకు రహదారుల వెంట చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరగడం వంటి ఘటనలు చోటుచేసుకొని విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడేది. ఈ క్రమంలో కీలకమైన సమాచార వ్యవస్థ దెబ్బతినడంతో పాటు అధికారులు, ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఇలాంటి కష్టాలను అధిగమించేందుకు 2010లో అప్పటి ప్రభుత్వ హయాంలో జిల్లా వ్యాప్తంగా అన్ని తహసీల్దారు, ఆర్డీవో కార్యాలయాలకు జనరేటర్లు కేటాయించారు. అప్పట్లో ఒక్కో జనరేటర్ ఏర్పాటుకు రూ.40వేల వరకు ఖర్చు చేశారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో వాటి ఏర్పాటు లక్ష్యం నీరుగారిపోయింది.

ఖర్చు అధికారులు భరించాలి: జనరేటర్లు కేటాయించినా వాటి వినియోగానికి అయ్యే డీజల్ కొనుగోలుకు నిధులు కేటాయించలేదు. ఆ ఖర్చు ఎవరు భరించాలన్న విషయమై స్పష్టత లేకపోవడంతో సమస్యగా మారింది. కొన్ని ప్రాంతాల్లో కొన్ని నెలలపాటు డీలర్లు, ఇతరుల సహాయంతో నడిపినా తరువాత వదిలేశారు. చాలాచోట్ల వాటిని ఒక్కసారి వినియోగించిన దాఖలాల్లేవు. కనీసం వాటికి రక్షణ కూడా లేకపోవడంతో ఎండకు, వానకు తడుస్తూ తప్పుపట్టి నిరుపయోగంగా మారాయి. ఇవి వినియోగంలోకి తెస్తే మామూలు రోజుల్లో విద్యుత్ అంతరాయాలు తలెత్తినా ఇబ్బందులు ఉండవని పలువురు కోరుతున్నారు.

బుద్ధుడి అష్టాంగ మార్గమే మానవ జీవితానికి ఆదర్శం



కరపత్రాలు చూపుతున్న ధ్యానులు

వింజమూరు, ఆగస్టు 18 : బుద్ధుడు చెప్పిన అష్టాంగ యోగమార్గమే మానవ జీవితానికి ఆదర్శనీయం అని దీన్ని ఆచరిస్తే ఎల్లప్పుడూ సుఖసంతోషాలతో ఆరోగ్యంగా జీవిస్తూ మోక్షానికి అర్హులవుతారని ఒంగోలు సీనియర్ పిరమిడ్ మాస్టర్ నన్నూరి వాసంతి తెలిపారు. శ్రీవేద వ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం జరిగిన సజ్జన సాంగత్యంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ధ్యానం గురించి ఉదాహరణలతో సందేశమిచ్చారు. శాకాహారం ప్రాముఖ్యతను వివరిస్తూ పిరమిడ్‌నగర్, వైశ్య బజార్, కుమ్మరి బజారు, ఎర్రబెల్లిపాలెం ప్రధాన రహదారుల్లో మహాకరుణ శాకాహార ర్యాలీ నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, తిరుపతిరావు, జానకీరామిరెడ్డి, సుబ్బారెడ్డి, చిన్న, వెంకటరెడ్డి, హేమలత, సుప్రజ, సీత, కౌసల్య, శాంతమ్మ, రేణుక, స్వరాజ్యం, కృష్ణవేణి, 70 మంది ధ్యానులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో సొసైటీ భవనాలు

వరికుంటపాడు, ఆగస్టు 18: స్థానిక సొసైటీ కార్యాలయ భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలిపోతాయో అని రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా కార్యాలయ గదికి ఆనుకొని ఉన్న ఎరువుల నిల్వ గదుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఆ గదుల శ్లాబులు పెచ్చులూడి పడుతుండటంతో పాటు గోడలు సైతం నెర్రలుబారి కూలే దశకు చేరుకున్నాయి. కనీసం తలుపులు, కిటికీలు సక్రమంగా లేకపోవడంతో ప్రభుత్వం ఎరువులను సరఫరా చేస్తే భద్రపరచడం సిబ్బందికి తలకు మించిన భారంగా మారుతుంది. చిన్నపాటి వర్షం కురిసినా విలువైన ఎరువులు తడిచి ముద్దవుతాయని అధికారులు వాపోతున్నారు. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లు అన్నచందంగా కాకుండా భవిష్యత్తు దృష్ట్యా ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గదులకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



సొసైటీ భవనం దుస్థితి ఇలా..

పారిశుధ్యలోపంతో రోగాలు

● ఆత్మకూరు పట్టణంలోని ఇళ్ల మధ్యలో 700లకు పైగా ఖాళీ స్థలాలు
● వాటిపై పర్యవేక్షణ లేక ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, కంపచెట్లు
● దోమలకు, విషపురుగులకు ఆవాసాలుగా మారిన వైనం

ఆత్మకూరు, ఆగస్టు 18: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని జెఆర్‌పేట, ఎల్ఆర్‌పల్లి, ఆర్టీసీ డిపో సమీపంలోని ప్రాంతాల్లో జనావాసాల మధ్య ఖాళీ స్థలాల్లో పారిశుధ్యం కొరవడి ప్రజలు రోగాల బారిన పడేందుకు ఆస్కారం ఎక్కువగా ఉంది. ఈ స్థలాలను కొన్న యజమానుల వాటిని పర్యవేక్షించక పోవడంతో డంపింగ్ యార్డులుగా దర్శనమిస్తున్నాయి. దానికితోడు పరిసర ప్రాంత ఇళ్లలో వాడిన నీరంతా ఈ స్థలాల్లో నిలిచి మురుగుకుపాలుగా దర్శనం ఇస్తున్నాయి. అందులో పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలు ఏపుగా పెరుగుతున్నాయి. స్థానికులు ఈ స్థలాల్లో కొబ్బరిబొండాలు, విరిగిపోయిన ప్లాస్టిక్ సామగ్రి, పాత టైర్లు ఇలా పనికిరాని చెత్తంతా తీసుకొచ్చి అందులో వేస్తున్నారు. వర్షం పడితే వాటిలో నీళ్లు చేరి ప్రమాదకర డెంగీ, మలేరియా జ్వరాలకు కారణమయ్యే దోమలు పెరుగుతున్నాయి.



పట్టణంలోని జేఆర్‌పేటలోని ఖాళీస్థలం దుస్థితి

ఖాళీ స్థలాలు 700 పైనే..

మున్సిపాలిటీ పరిధిలో 23వార్డులు ఉంటే ఖాళీస్థలాలు మాత్రం 700లకు పైగా ఉన్నాయి. అందులో అధికారికంగా 192స్థలాలను గుర్తించారు. గుర్తింపు లేని ఖాళీస్థలాలు మరో 520కిపైగా ఉన్నాయి. ఈ స్థలాలను చదును చేయించి పిచ్చిమొక్కలు మొలవకుండా, మురుగునీరు నిల్వ ఉండకుండా, చెత్త వ్యర్థాలు ఖాళీస్థలాల్లో పడేయకుండా ఉంచాలని కోర్టు ఆదేశించింది. అలా చేయని ఖాళీస్థలాల యజమానులకు రూ.1000లు జరిమానా విధించాలని ఉత్తర్వులను మున్సిపల్ అధికారులకు జారీ చేసింది. ఈ ఆదేశాలు ఎక్కడ అమలుకావడం లేదు. శాశ్వత ప్రాతిపదికన చర్యలు ఉండడం లేదు. ప్రజల అనారోగ్యాలకు ముప్పువాటిల్లడానికి కారణమైన ఖాళీ జాగాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల మున్సిపాలిటీ పరిధిలో రూ.22 లక్షలతో మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపడుతున్నారు. కానీ జనావాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల శుభ్రతను అటు స్థలం కొన్న యజమానులు లేదా మున్సిపల్ అధికారులు పట్టించుకోక పోవడం వల్లే ఈ దుస్థితి నెలకొందని పట్టణవాసులు వాపోతున్నారు.

నేడు ఉపాధి హామీ ప్రజావేదిక

కలిగిరి, ఆగస్టు 18: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటలకు ఎన్ఆర్ఈజీఎస్ 2023-24 సంవత్సరానికి సంబంధించి ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రంగసుబ్బరాయుడు తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచులు, ఉపాధికూలీలు హాజరుకావాలని కోరారు.

సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు ముందంజ

● కావలి ఆర్యవైశ్య నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

కావలి, ఆగస్టు 18: సేవా కార్యక్రమాలు చేపట్టడంలో ఆర్యవైశ్యులు అందరికంటే ముందజలో ఉంటారని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. వాణిజ్యపరంగా కావలిని అభివృద్ధి చేసిన ఘనత ఆర్యవైశ్యులదే అని కొనియాడారు. ఆర్యవైశ్య సంఘం కావలి మండల నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం స్థానిక బృందావనం హౌసింగ్ కాలనీ కల్యాణమండపంలో జరిగింది. సంఘం అధ్యక్షుడిగా తటవర్తి రమేష్ కార్యదర్శిగా ఓరుగంటి రామకృష్ణ కోశాధికారిగా కంచర్ల చక్రితో పాటు నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అమర్తలూరి చెంచయ్య వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డీవీ క్రిష్ణారెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో అనేక సత్రాల నిర్మాణంలో వీరిది కీలక పాత్ర అన్నారు. కావలిలో టీడీపీ విజయం కోసం ఆర్యవైశ్యులు ఎంతో కృషిచేశారని వారికి ఎల్లప్పుడు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కావలిలో ఆనాటి చక్కా సత్యం.. నిన్నటి గ్రంధి యానాదిశెట్టి.. నేటి పోతుగంటి అలేఖ్య వరకు అందరూ రాజకీయాలకు వన్నె తెచ్చారని గుర్తుచేశారు. కావలిలో ఆర్యవైశ్య భవనం ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఆర్యవైశ్యులలో పేదవారి వివాహాలకు ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. అనంతరం కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్ర అభివృద్ధి నిర్వీర్యం అయ్యిందన్నారు. టీడీపీతోనే అభివృద్ధి జరుగుతోందనే నమ్మకంతో ప్రజలు తిరుగులేని మెజార్టీ ఇచ్చారని చెప్పారు.

రాజకీయాలకతీతంగా సేవలందిస్తా: తటవర్తి రమేష్

ఎమ్మెల్యే సహకారంతో రాజకీయాలకతీతంగా ఆర్యవైశ్యులకు సేవలందిస్తానని నూతనంగా ఎన్నికైన సంఘ అధ్యక్షుడు తటవరి రమేష్ తెలిపారు. అంతకుముందు నూతన కార్యవర్గం వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు చేశారు. అలాగే పొట్టి శ్రీరాములు విగ్రహం, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ర్యాలీగా ప్రమాణస్వీకార వేదిక వద్దకు చేరుకున్నారు. కావలి మున్సిపల్ మాజీ చైర్మన్ పోతుగంటి అలేఖ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త కనమర్లపూడి కోటేశ్వరరావు వామ్ గ్లోబల్ అధ్యక్షుడు తంగుటూరి రామక్రిష్ణ , వామ్ తెలంగాణా ఇన్‌చార్జి ఎన్. గురుప్రసాద్, బీజేపీ రాష్ట్ర సంయుక్త కోశాధికారి కందుకూరి వెంకటసత్యనారాయణ, కొండబిట్రగుంట దేవస్థాన మాజీ చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి, ఆర్యవైశ్యమహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ, మహిళావిభాగ్ ఇన్‌చార్జి కొప్పవరపు రజినీ, పందా వెంకటేశ్వర్లు, కొట్టు సత్యనారాయణ, సంఘం నెల్లూరు నగర అధ్యక్షుడు కొండా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్యవైశ్య అధ్యక్షుడిని అభినందిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

రెండు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

లింగసముద్రం, ఆగస్టు 18: మండలంలోని వీఆర్ కోట గ్రామ సమీపంలోని మన్నేరు వాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం రావడంతో ఆదివారం ఉదయం ఎస్సై ఎం బాజీబాబు, సిబ్బంది దాడి చేసి రెండు ట్రాక్టర్లను గ్రామ శివారులో పట్టుకున్నారు. ట్రాక్టర్లను, డ్రైవర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ప్రజావ్యతిరేక విధానాలపై నిరంతర పోరాటం

● సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు

కావలి టౌన్, ఆగస్టు 18: కేంద్రం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందని, అందుకు వ్యతిరేకంగా నిరంతర పోరాటాలు చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన పార్టీ రాజకీయ శిక్షణా తరగతుల్లో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. కేంద్రం తీసుకొచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా సీపీఎం పెద్దఎత్తున ఉద్యమించిందని, సీపీఎం కార్యకర్తలు సమాజం కోసం పనిచేయాలని పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మతోన్మాదంతో దేశానికి ముప్పు వాటిల్లుతుందని చెప్పారు. అలాగే లౌకికవాదం, ప్రజాస్వామ్యం సన్నగిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేసారు. కేంద్ర పాలకులు దేశభక్తి ముసుగులో రాజ్యాంగాన్ని తూట్లు పొడుస్తున్నారని ప్రధాని మోదీ మాటల గారడీతో పాలన సాగిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి పెంచులయ్య, రామచంద్రయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాదాల వెంకటేశ్వర్లు

తెలుగును పాలనా భాషగా అమలు చేయాలి

అల్లూరు, ఆగస్టు 18 : తెలుగును పాలనాభాషగా అమలు చేయాలని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ సమన్వయ కమిటీ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పాలనా కార్యక్రమాలన్నీ తెలుగులోనే నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రాథమిక విద్యను కనీసం 30శాతం కూడా తెలుగులో అమలు చేయకుంటే అది మృతభాషగా ఎలా మారుతుందని యునెస్కో హెచ్చరించిందన్నారు. రచయితలు, కళాకారులు మేధావులు నిరంతరం తెలుగు భాషకు వన్నె తెచ్చేలా కృషి చేయాలన్నారు. భాష పరిరక్షణకు తెలుగు అధికార భాషా సంఘం చర్యలు తీసుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

కలిగిరి, ఆగస్టు 18: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కలిగిరి పీహెచ్‌సీ వైద్యులు బిజ్జం గీతారెడ్డి తెలిపారు. పడమర గుడ్లదొన ఎస్సీకాలనీలో జ్వర లక్షణాలు బాధపడు తున్న వారికి ఆదివారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించి మాట్లాడారు. గత బుధవారం జ్వర లక్షణాలున్న రోగులను పరీక్షించగా డెంగ్యూ, మలేరియా జ్వరాలు నమోదు కాలేదన్నారు. ప్రస్తుతం జ్వర లక్షణాలతో బాధపడేవారు వైద్యులు సూచించే సూచనలు పాటించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరాలు తగ్గుముఖం పట్టేంతవరకు వైద్యశిబిర సేవలను వినియోగించుకోవాలన్నారు.

నేడు అయ్యప్పస్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం

కందుకూరు, ఆగస్టు 18: శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం 6 గంటలకు సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే భక్తులు పసుపు కుంకుమ, పూజ సామాగ్రి తెచ్చుకోవాలని తెలిపారు. వ్రతం అనంతరం తీర్థప్రసాదాలు అందజేయటం జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి పూజలో పాల్గొనాలని విజ్ఞప్తిచేశారు.

ఇంటింటికీ కొళాయి కనెక్షన్ సర్వే

కావలి ఆగస్టు 18: జలజీవన్‌మిషన్‌లో భాగంగా పట్టణంలోని ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్ ఇచ్చి శుద్ధి చేసిన మంచినీటిని ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలోని కాలనీల్లో 1 నుంచి 28 సచివాలయాలలో పనిచేస్తున్న మౌలిక వసతుల కార్యదర్శులు ప్రతి గృహాన్ని సందర్శిస్తారని పేర్కొన్నారు. మంచినీటి కొళాయి స్థితి, వ్యత్యాస విశ్లేషణను పరిశీలించి వెబ్ అప్లికేషన్‌లో వివరాలను నమోదు చేస్తారన్నారు. ఈ సర్వే ఈ నెల 16 నుంచి పట్టణంలో జరుగుతోందని కార్యదర్శులు మీ ఇంటికి వచ్చినపుడు కొళాయికి సంబంధించిన వివరాలను వారికి తెలియజేసి సహకరించాలని కోరారు.

నిందితులకు ఉరిశిక్ష వేయాలి

కందుకూరు, ఆగస్టు 18: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసిన వారికి ఉరిశిక్ష వేయాలని మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు వర్ల దేవదాస్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశంలో అత్యాచారాలు అరికట్టాలంటే మానవ మృగాలకు ఉరిశిక్షలు విధించటమే సరైనదని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

సంజీప్‌కుమార్‌కు వాకర్స్ సన్మానం

బిట్రగుంట, ఆగస్టు 18: స్థానిక రైల్వే సెక్షన్ పరిధిలో రన్నింగ్ ట్యాఫ్ లోకోపైలెట్ ఎల్సీ సంజీప్‌కుమార్ బదిలీపై సొంత రాష్ట్రం బీహార్‌కు వెళ్లనున్న సందర్భంగా ఆయన్ను బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం సన్మానించారు. 12 ఏళ్లుగా బిట్రగుంటలో విధులు నిర్వహిస్తూ రైల్వే ఫుట్‌బాల్ మైదానం అభివృద్ధికి ఆయన చేసి సహకారం మరువలేనిదని వాకర్స్ సంఘం అధ్యక్షుడు ఎం.స్వర్ణన్‌రాజు అన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, ఫౌండర్ అధ్యక్షుడు శ్రీనివాసులు, సభ్యులు సత్యనారాయణ చార్యులు, జనార్ధన్, శ్రీనివాసులు, సుధాకర్, క్రిష్ణారెడ్డి, ఆర్ఆర్ మిత్రబృందం ఉన్నారు.

సాగరంలో కుక్కల బెడద

అనంతసాగరం, ఆగస్టు 18: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో గుంపులు గుంపులుగా సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. చికెన్ వ్యాపారాలు చేసే నిర్వాహకులు కోళ్ల వ్యర్థాలను సోమశిల రోడ్డులో వేస్తున్నారు. వాటిని రుచి మరిగిన కుక్కలు మేకలు, గొర్రెలపై అవి దాడి చేస్తున్నాయి. అప్పుడప్పుడు జనాలపైకి వస్తున్నట్లు ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని గేదె మృతి

నష్టపరిహారం చెల్లించాలని రైతు మొర

వలేటివారిపాలెం, ఆగస్టు 18 : కందుకూరు నుండి మొగిలిచెర్ల వెళ్తున్న ఆర్టీసీ బస్ శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో జాతీయ రహదారిపై వెళ్తున్న గేదెను ఢీకొంది. దీంతో సమాచారం తెలుసుకున్న రైతు రవీంద్రతో పాటు మరికొంతమంది రైతులు సంఘటనా స్థలానికి వెళ్లి గేదెను ఇంటికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తుండగా శనివారం రాత్రి మృత్యువాత పడింది. గేదె విలువ లక్ష రూపాయలకు పైగా ఉంటుందని, ఆర్టీసీ అధికారులు స్పందించి నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతు రవీంద్రతో పాటు గ్రామస్థులు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

వరికుంటపాడు, ఆగస్టు 18: మండలంలోని ఇస్కపల్లి-వరికుంటపాడు, ఇస్కపల్లి-విరువూరు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి కూడలి సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదాలకు నిలయంగా మారింది. రహదారికి ఆనుకొని అతి తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను చూసిన ప్రజలు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. దీనితో ఎప్పుడు.. ఎవరికి ప్రమాదం జరుగుతుందో అని వాపోతున్నారు.

ఈ మార్గంలో ప్రతినిత్యం తిరిగే వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా ఇక అంతేసంగతులు అంటున్నారు. పశువులు, మూగజీవాలు మేతకోసం అటుగా వెళ్లిన సమయంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశాలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరుగకముందే చర్యలు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

దర్గాగా తోపు పోరంబోకు స్థలం కబ్జా

● అధికారుల ఆదేశాలు పాటించని వైసీపీ నేతలు

● యథేచ్ఛగా దుకాణాల నిర్మాణం



కబ్జాకు గురైన స్థలంలో అక్రమంగా నిర్మించిన దుకాణాలు

పొదలకూరు, ఆగస్టు 18: కబ్జాకు కాదేది అనర్హం అన్న చందంగా మండలంలోని అమ్మవారిపాలెంలోని వైసీపీ నాయకులు తయారయ్యారని గ్రామస్థుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామంలోని సర్వే నెంబరు 173లోని తోపు పోరంబోకు స్థలమైన రెండు ఎకరాలను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే ఈస్థలంలో నాలుగు దుకాణాలు నిర్మించి షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటుచేశారు. గతంలో గ్రామంలోని వివిధ ఇళ్ల నుంచి మేతకు వెళ్లే గేదెలను ఈ స్థలంలోకి తోలేవారు. అందరి పశువులు వచ్చాక ఈ బర్రెల మందను స్థలం నుంచి అడవికి మేతకు తోలుకొనిపోయేవారు. గ్రామంలోని పశువులకు ఎంతగానో ఉపయోగపడే ఈ తోపు పోరంబోకు స్థలంపై వైసీపీ నాయకుల కన్నుపడింది. గత ప్రభుత్వంలో గ్రామంలోని కొంతమంది కార్యకర్తల పేర్లతో కొంత భూమిని ఆక్రమించుకోవడమే కాకుండా, ఓ వ్యక్తి మెయిన్ రోడ్డును ఆనుకుని వున్న ఈ స్థలంలో ఏకంగా నాలుగు దుకాణాలు నిర్మించి వ్యాపారాలు కూడా మొదలు పెడుతున్నారు. ఇప్పటికైనా మండల రెవెన్యూ అధికారులు, పంచాయితీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసు కోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. లేదంటే పశువులకు ఇబ్బందులు తప్పవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈ స్థలంలో ఎటువంటి ఆక్రమణలు చేపట్టరాదని గతంలో తహసీల్దారు నోటీస్ బోర్డు పెట్టినా గ్రామంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఏమాత్రం లెక్కచేయకుండా ఆక్రమణల పర్వం కొనసాగించడంపై సర్వత్రా విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.

మంత్రి నారాయణకు వీసీ సన్మానం



మంత్రి నారాయణను సన్మానిస్తున్న వీసీ

వెంకటాచలం, ఆగస్టు 18: రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణను విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కరరావు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శాలువాతో మంత్రిని సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం యూనివర్సిటీ అభివృద్ధి, పరిశోధన, అకడమిక్ ప్రోగ్రామ్స్, నిధులు, వనరుల గురించి చర్చించారు. ఈసందర్భంగా వీఎస్‌యూ అభివృద్ధికి అవసరమైన సహాయం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే సోమిరెడ్డికి రాఖీ శుభాకాంక్షలు



సోమిరెడ్డికి రాఖీ కడుతున్న ఆదాల సుగుణమ్మ

పొదలకూరు, ఆగస్టు 18: సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి టీడీపీ పొదలకూరు మండల మహిళా అధ్యక్షురాలు ఆదాల సుగుణమ్మ ఆదివారం రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఒక వివాహ వేడుకకు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హాజరై స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ప్రజా సమస్యలను పరిష్కరించడానికి గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆదాల సుగుణమ్మ, వెంపులూరు అరుణ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి రాఖీ కట్టి, స్వీట్లు తినిపించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, అక్కెం సుధాకర్‌రెడ్డి, కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, పులిపాటి వెంకటరత్నంనాయుడు, బక్కయ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు పరిశీలన

పొదలకూరు, ఆగస్టు 18 : పొదలకూరు నెట్టెం భాస్కర్ లేఅవుట్‌లో వాగుపై ఉన్న కల్వర్టులను ఆదివారం తహసీల్దారు సారంగపాణి, మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. వెంకటేశ్వరస్వామి దేవస్థానం వారు, స్థానికులు కల్వర్టులు అడ్డంలేదని, నీరు పోయే సదుపాయం ఉందని తహసీల్దారుకు చెప్పడంతో పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కి ఘన నివాళి



నేతాజీకి నివాళులు అర్పిస్తున్న ఆశ్రమ కమిటీ నిర్వాహకులు

ఇందుకూరుపేట, ఆగస్టు 18: మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం స్వాతంత్ర్య పోరాట యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్థంతి కార్యక్రమం, అదేవిధంగా సర్వమత ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముందుగా కమిటీ సభ్యులు గంపల మంజుల నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మహాత్మాగాంధీ, స్థలదాత పొనక కనకమ్మ విగ్రహాలకు ఖాదీ వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. అనంతరం ఆశ్రమ కోకన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి మాట్లాడుతూ తెల్లదొరలను గడగడలాడించి, వారి కబంధ హస్తాల నుంచి భరతమాతకు విముక్తి కలిగించేందుకు తన ప్రాణాలను సైతం అడ్డుపెట్టి పోరాడిన నాయకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని తెలిపారు. ఇలాంటి మహోన్నత వ్యక్తులను యువకులు స్ఫూర్తిగా తీసుకుని దేశానికి రక్షణగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, స్కూల్ విద్యార్థులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పిచ్చి మొక్కలు తొలగిస్తున్న తహసీల్దారు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 18: ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం బుచ్చి తహసీల్దారు కార్యాలయం ఆవరణలో మనం మన పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని సిబ్బందితో కలిసి నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించి పరిశుభ్రం చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గతంలో సీఎం నారా చంద్రబాబునాయుడు శ్రమదానం కార్యక్రమంతో ఎంతో చైతన్యం వచ్చిందన్నారు. అదే స్ఫూర్తితో ఆదివారం తమ కార్యాలయాన్ని పరిశుభ్రం చేశామన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, హాస్టళ్లు పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

● జడ్పీ హైస్కూల్‌కి ఆర్‌వో వాటర్ ప్లాంట్ వితరణ



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఇందుకూరుపేట, ఆగస్టు 18 : మండలంలోని ఆదెమ్మ సత్రం జిల్లా ప్రజాపరిషత్ హైస్కూల్‌లో ఆదివారం 1997-98 సంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. అందులో భాగంగా పూర్వ విద్యార్థులు హైస్కూల్‌లో ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి సోషల్ ఉపాధ్యాయుడు శేషయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ హైస్కూల్‌లో ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు వల్ల విద్యార్థులకు నీటి కొరత తీరుతుందని, భవిష్యత్తులో ఇలాంటి మంచి కార్యక్రమాలు చేసి హైస్కూల్ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సురేష్, జగదీష్, సునీల్, శ్రీనివాస్ గాంధీ, శ్రీధర్, చిట్టి, శ్రీను, అధిక సంఖ్యలో పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో మొక్కుబడిగా బాల స్వాస్థ్య ..!

పొదలకూరు, ఆగస్టు 18: పదేళ్ల నిండని పాలబుగ్గలను పలు రకాల అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడంతో సకాలంలో వైద్యం చేయించలేకపోతున్నారు. పిల్లల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రధానంగా దంత సమస్యలు, కంటి జబ్బులు, పౌష్టికాహార లోపం వంటివి వేధిస్తున్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో అంతగా పట్టించుకోలేదు. మొక్కుబడిగా వైద్య పరీక్షలు చేసి మమ అనిపించారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలైనా పాఠశాలల్లో వైద్య పరీక్షలు ప్రారంభించకపోవడం గమనార్హం. చికిత్స కన్నా నివారణే మిన్న అనే ఉద్దేశంతో బాల స్వాస్థ్య (ఆర్‌బీఎస్‌కే) కార్యక్రమాన్ని రూపొందించారు. చిన్నారుల్లో పుట్టుకతో వచ్చే లోపాలు దీర్ఘకాలిక వ్యాధులు, సాధారణ అనారోగ్య సమస్యలు గుర్తించి వారి ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ చర్యలు తీసుకోవాలి. జిల్లాస్థాయిలో ప్రత్యేక వైద్య బృందం అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి. 6-18 ఏళ్ల వయస్సు వారికి వైద్య పరీక్షలు చేయాలి. వారిలో ప్రత్యేక వైద్యం అవసరమైన వారిని గుర్తించి సర్వజనాసుపత్రుల్లోని డీఈఐసీ (డిస్ట్రిక్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్)కు తరలించాలి. శస్త్రచికిత్సలు తప్పనిసరైతే రిఫరల్ కేంద్రాలకు సిఫార్సు చేయాలి, హృద్రోగాలు, గ్రహణం మొర్రి వంటి సమస్యలున్న వారికి కార్పొరేట్ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు చేయించాలి.

● గుర్తించలేకపోతున్న తల్లిదండ్రులు

ఆహారపు అలవాట్లు, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాలు, కుటుంబ స్థితిగతులతో పలు వ్యాధులు బాలలకు సంక్రమిస్తున్నాయి. మరికొందరు వంశపారంపర్య వ్యాధులతో బాధపడుతున్నారు. చిన్నారులు ప్రధానంగా నరాల సంబంధిత వ్యాధులు, గ్రహణమొర్రి, పెదవి చీలిక, వంకర పాదాలు, నడుము భాగంలో అభివృద్ధిలో లోపంతో ఇబ్బందిపడుతున్నారు. కంటిచూపు, వినికిడి లోపాలు, గుండెజబ్బులు, రక్తహీనత, విటమిన్ ఏ, డీ లోపం, పోషకాహార లోపం, చర్మవ్యాధులు, శ్వాసకోశ సంబంధిత రుగ్మతలు, పిప్పిపళ్లు, నాడి సంబంధ చలన సమస్యలు, బుద్ధిమాంద్యం, మాటలు రాకపోవడం, తలసేమియా వంటి వ్యాధులు బాలలను బాధిస్తున్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో అంతగా పట్టించుకోలేదు. మొక్కుబడిగా వైద్య పరీక్షలు చేసి మమ అనిపించారు. గతేడాది పొదలకూరు మండలంలో సంచార ఆరోగ్య బృందాలు చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాయి.

పనులు లేక పడమటి పల్లెలకు వలస



ఆటోలో వెళుతున్న కూలీలు

చిట్టగుంట, ఆగస్టు 18: మండలంలోని జువ్వలదిన్నె, తూర్పు తీర ప్రాంతాలు ఎస్వీపాలెం, ముంగమూరు, చిట్ట గుంట పంచాయతీలకు చెందిన గిరిజనులు, మత్స్యకారులది రెక్కాడితేనే డొక్కాడని పరిస్థితి. వీరు దినసరి కూలీలు పొట్టకూటి కోసం పడరాని అగచాట్లు పడుతున్నారు. వీరి ఉండే ప్రాంతంలో ప్రస్తుతం పనులు లేకపోవడంతో బోగోలు మండల పరిధిలోని పడమటి పల్లెల్లో వేరుశనగ కోతలు మొదలయ్యాయి. ఆ పనులు చేసుకునేందుకు ప్రతిరోజూ ఉదయం 6గంటలకే ఆటోల్లో పరిమితికి మించి ప్రమాదకరంగా ప్రయాణాలు సాగిస్తున్నారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

● సందిగ్ధంలో అధికారులు, ఉద్యోగులు

● 20 ఏళ్లుగా ఇక్కడే ఉద్యోగ ప్రస్థానం

● సర్వీసు రూల్స్ లేకపోవడంతో పాతుకుపోయిన వైనం

● గత టీడీపీ హయాంలో మంత్రి నారాయణ ప్రయత్నం



ఎన్‌ఎంసీలో బదిలీలు జరిగేనా..!?

నెల్లూరు(సిటీ), ఆగస్టు 18 : ప్రభుత్వ శాఖల్లో పాలన వ్యవహారాలను ప్రక్షాళన చేసేం దుకు సాధారణ బదిలీలకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. అందులో మున్సి పల్ పరిపాలన శాఖ కూడా ఉంది. కానీ కార్పొరే షన్లకు సర్వీసు రూల్స్ లేకపోవడంతో ఇక్కడ పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులను బయట ప్రాంతాలకు బదిలీ చేసే అవకాశం లేదు. దీంతో గడిచిన 20 ఏళ్లుగా ఇక్కడే విధులు నిర్వర్తిస్తున్న అధి కారులు, ఉద్యోగులు రాజకీయ అండదండలతో వారు కోరుకున్న స్థానాలలో పాతుకుపోయారు. పాలనా పరంగా వీరు అడ్డంకైనప్పటికీ ప్రభుత్వ నిబంధన లు లేకపోవడంతో ఎవరు ఏమి చేయ్యలేని దుస్థితి ఏర్పడింది. 2014-19లలో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో కార్పొరేషన్లలోని ఉద్యోగులకు పక్క కార్పొరేషన్లకు బదిలీ చేయాలన్న నిర్ణ యాన్ని తెరపైకి తీసుకున్న మంత్రి నారాయణ అది ఆచరణకు నోచుకోకపోవ డంతో కార్పొరేషన్లలో అధికారులు ఏళ్ల తరబడి పాతుకుపోయారు. ఇకనైన మంత్రి నారాయణ జోక్యంతో దస్త్రం కదులుతుందేమోనని ఎదురు చూస్తున్నారు. నెల్లూరు కార్పొరేషన్‌లో ఒక్కో ఆర్‌ఐ ఏళ్ల తరబడి ఇక్కడే పనిచేస్తున్నారు. ఇందులో బిల్‌కలెక్టర్లుగా ఉద్యోగ ప్రస్తానం మొదలుపెట్టి ఆర్‌ఐగా, త్వరలో ఆర్వోగా పని చేసే అవకాశాలు న్నాయి. ఆరోగ్యం, అకౌంట్స్ విభాగాలలో ఇదే తీరు కొనసాగుతోంది. ఇక్కడే ఉద్యోగం పొంది ఇక్కడే పదవీ విరమణ చేసే స్థితికి కార్పొరేషన్ చేరింది. ఇంజనీరింగ్, సిటీ ప్లానింగ్ విభాగాలు తప్ప మిగిలిన విభాగాలలోని ఉద్యోగులు దాదాపుగా ఇక్కడే ఉద్యోగాలు పొంది ఏళ్ల తరబడి పని చేస్తున్నావారే. దీనివల్ల మితిమీరిన నిర్లక్ష్యం, అవినీతి, రాజకీయ జోక్యంతో పాలన వ్యవహారాలు పక్కదారి పడుతున్నాయన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. కమిషనర్‌గా ఐఏఎస్ స్థాయి అధికారి ఉన్నప్పటికీ ఆయన తీ సుకునే నిర్ణయాలు అమలు చేయాల్సింది కిందస్థాయి ఉద్యోగులే. దీంతో వీరంతా బలమైన రాజకీయ అండదండ లుండటంతో పాలనలో చురుగ్గా పని చేయడంలే దన్న ఆరోపణలు న్నాయి. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన బదిలీలతో అన్ని శాఖల్లో సందడి మొదల వగా కార్పొరేషన్‌లో మాత్రం అలాంటి జాడే లేదు.

● నూతన సంస్కరణలకు తెరలేపిన నారాయణ

కార్పొరేషన్‌లో పని చేస్తున్న ఉన్నతాధికారి నుంచి కిందస్థాయి సిబ్బంది వరకు మరొక కార్పొరేషన్‌కు బదిలీ అయ్యే విధంగా గత టీడీపీ హయాంలో నూతన సంస్కరణలకు మంత్రి నారాయణ తెరలేపారు. ఈ నిర్ణయం దాదాపుగా దస్త్రం సిద్ధమై పాలన అనుమతులు పొందే సమయంలో టీడీపీ అధికారం కోల్పోవడంతో ఆ సంస్కరణ మూలనపడింది. తిరిగి ఆ దస్త్రం అమల్లోకి వస్తే నెల్లూరు కార్పొరేషన్‌లో ఏళ్ల తరబడి పాతుకుపోయిన అనేక మంది ఉద్యోగులు, అధికారులకు స్థానచలనం కలుగుతోందని ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం మున్సిపల్ పాలన శాఖల్లో మున్సిపాలిటీల వరకే బదిలీల ప్రక్రియ ఉన్నందున కార్పొరేషన్లకు వర్తించే విధంగా సర్వీసు రూల్స్‌ను అమల్లోకి తేవాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో రంగడి పవిత్రోత్సవం



ప్రత్యేక అలంకారంలో శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామి

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 18 : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో ఆదివారం రంగనాథుడు, శ్రీదేవి భూదేవిలకు పవిత్రోత్సవం కనుల పండువగా జరిగింది. ఉదయం నిత్య హోమాలు, తీర్థప్రసాద వినియోగం జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఉత్సవాలను ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

● ఆలయాల్లో నేడు రాఖీ పౌర్ణమి

సుజాతమ్మకాలనీలోని అష్టలక్ష్మీ ఆలయంలో ఉదయం 9 గంటలకు శ్రీకృష్ణస్వామికి పుష్పాభిషేకం, రుద్రహోమం, అష్టలక్ష్మీ హోమాలు జరుగుతాయి.

● మహాత్మాగాంధీనగర్ శ్రీకృష్ణమందిరంలో ఉదయం 9గంటకు శ్రీసత్యనారాయణ స్వామి వ్రతం జరుగుతుంది. 12గంటలకు అన్నదానం

● ఉదయం 9గంటలకు రాజరాజేశ్వరి అమ్మవారికి అభిషేకం, ఉత్సవమూర్తికి పసుపు, కుంకుమలతో అభిషేకం, గాయత్రిదేవికి అభిషేకం, విశేష అలంకారం, ప్రత్యేక పూజలు జరుగుతాయి.

వ్యాధి పీడిత చిన్నారులకు పౌష్టికాహారం



పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్న అజయ్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 18: వ్యాధి పీడిత పిల్లలకు న్యూట్రిషన్ టార్గెటెడ్ సివిల్ సప్లై స్కీం కింద పౌష్టికాహారం ప్రభుత్వం నుంచి అందేవిధంగా పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో చర్చించి చర్యలు చేపడుతామని జనసేన పార్టీ జాతీయ మీడియా ప్రతినిధి వేములపాటి అజయ్ పేర్కొన్నారు. నగరంలోని కొండాయపాలెంలో ఉన్న అబైడింగ్ చర్చిలో వ్యాధిగ్రస్థులైన పిల్లలకు ఆదివారం జనసేన నాయకులు పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైటస్ నిర్మల్ కుమార్ ఆహ్వానం మేరకు చిన్నారులకు పౌష్టికాహారం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ జయప్రకాష్, జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, నూనె మల్లికార్జున యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ ఫ్యామిలీ దాబా కస్టమర్లకు ఉచిత కారు రవాణా సేవ

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 18 : నగరంలోని మినీబైపాస్‌రోడ్డు గోమతీనగర్ వద్ద ఉన్న ఎస్ఎస్ ఫ్యామిలీ దాబా యాజమాన్యం తమ భోజన ప్రియులకు ఉచిత కారు ప్రయాణం సౌకర్యం కల్పిస్తున్నట్లు దాబా అధినేత పువ్వాడి సాయికుమార్ తెలిపారు. మా రెస్టారెంట్‌లో విందు చేసేవారికి ఉదయం 11.30 నుంచి 3గంటల వరకు, రాత్రి 7 నుంచి 9.30 గంటల వరకు ఉచిత కారు సర్వీసు ఏర్పాటు చేశామన్నారు. మా దాబాకు చుట్టు 5 నుంచి 6 కి.మీల పరిధిలోని భోజన ప్రియులు ఈ సౌకర్యంను వినియోగించుకోవచ్చని తెలిపారు ఎక్కడ పికప్ చేసుకుంటామో భోజనం చేసిన తర్వాత అక్కడే డ్రాప్ చేస్తామన్నారు. ఉచిత కారు సౌకర్యం పొందాలనుకునే కస్టమర్లు రెస్టారెంట్‌కి లోకేషన్ పంపాలని కోరారు. తొలిసారి మా దాబాలో భోజనం చేసిన వారికి గిఫ్ట్ కూపన్లు ఇస్తున్నామన్నారు. ఈ అవకాశం నగర ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీసూర్య జ్యూవెలరీ షాపు ప్రారంభం



జ్యూవెలరీ షాపు ప్రారంభోత్సవంలో పాల్గొన్న సినీనటి నేహాశెట్టి

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 18: నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఆదివారం శ్రీసూర్య జ్యూవెలరీ షాపును సినీనటి రాధిక డీజే టిల్లు ఫేమ్ (నేహా శెట్టి) ప్రారంభించారు. ఆమెను చూసేందుకు అభిమానులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు.యువకులు ఈలలు వేస్తూ ఆ ప్రాంతంలో సందడి చేశారు. హాయ్.. నెల్లూరు ఎలా ఉన్నారు ? ఎన్నోసార్లు నెల్లూరు రావాలని అనుకున్నా.. నాకు ఇప్పుడు అవకాశం వచ్చింది. చాలా సంతోషంగా ఉంది. అని ఆమె అన్నారు.

'ఎల్‌డీ కంప్యూటర్ ఆపరేటర్ల గురించి మాట్లాడటం సరికాదు'

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 18 : ఎల్‌డీ (లోయర్ డివిజన్) కంప్యూటర్ ఆపరేటర్స్ విద్యార్హత గురించి మినిస్టీరియల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు మాట్లాడటం సరికాదని ఎల్‌డీ కంప్యూటర్స్ ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు గిరిబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ గురించి అవమానకరంగా మాట్లాడటం ఏమిటని, దీనివల్ల తమ మనోభావాలు దెబ్బతినే అవకాశం ఉందని తెలిపారు. 462 జీవో ప్రకారం జూనియర్ అసిస్టెంట్లు ఏఎస్‌వోలుగా పదోన్నతులు పొందారని, 35 ఏళ్లుగా ఎల్‌డీ కంప్యూటర్ ఆపరేటర్లకు పదోన్నతులు లేవని తెలిపారు. 143 జీవో ప్రకారం పీహెచ్‌సీలలోనే పనిచేస్తున్నామని పేర్కొన్నారు. జూనియర్ సహాయకుల ఉత్తర్వులు తమకు ఒకటేనని, అయితే మేము ప్రభుత్వానికి వ్యతిరేకమన్నట్లు దుష్ప్రచారం చేయడం అన్యాయమని పేర్కొన్నారు.

నెల్లూరు రూరల్ ఎంపీడీవోగా శైలేంద్రకుమార్



ఎమ్మెల్యేని కలిసిన శైలేంద్రకుమార్

నెల్లూరురూరల్, ఆగస్టు 18 : నెల్లూరు రూరల్ మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో పరిపాలన అధికారిగా పని చేస్తున్న శైలేంద్ర కుమార్‌కు ఎంపీడీవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జడ్పీ సీఈవో ఉత్తర్వులిచ్చారు. దీంతో ఆదివారం ఆయన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత సాఫల్య అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 18 : మాజీ భారత రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరిట వచ్చే నెలలో ఆయన జయంతి రోజున జీవన సాఫల్య అవార్డులు ప్రదానం చేస్తున్నట్లు అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యారంగం అభివృద్ధికి కృషి చేసిన అధ్యాపకులు, ప్రధానాచార్యులు, వైద్య, సామాజిక, సాంస్కృతిక, ఇతర వృత్తులలో శిక్షణ ఇస్తున్న గురువులు ఈ అవార్డుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. తమ పూర్తి వివరాలు, సేవలు వివరాలతో ఈనెల 28వ తేదీలోగా దరఖాస్తులు పంపాలని కోరారు. సెప్టెంబరు 8వ తేదీ గురుపూజోత్సవం రోజు ఎంపికైన వారికి తిరుపతిలో అవార్డులు ప్రదానం చేస్తామని తెలిపారు. తమ దరఖాస్తులను 6302908528, 9705313061, 9440225924కు వాట్సప్ పంపాలని కోరారు.

డాక్టర్ కృష్ణమూర్తికి ఉద్యోగోన్నతి



డాక్టర్ కృష్ణమూర్తి

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 18 : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యుడిగా, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కృష్ణమూర్తి అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగోన్నతి పొందాడు. దీనికి సంబంధించి తాజాగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నుంచి ఉత్తర్వులు అందాయి. డాక్టర్ కృష్ణమూర్తి నెల్లూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితో పా టు ప్రకాశం రిమ్స్ జనరల్ ఆసుపత్రిలోనూ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఏడాది క్రితం నెల్లూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వచ్చిన ఆయనకు ఉద్యోగోన్నతి రావడంపై జీజీహెచ్ వైద్యులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాజరాజేశ్వరికి బంగారు ఆభరణాల వితరణ




ఈవోకి ఆభరణాలు అందజేస్తున్న దాత

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 18 : నగరంలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి దాత వి.మధుశేఖర్ ఆదివారం మూడు వరసల బంగారుబొట్టు (24గ్రాములు 60మిల్లీ గ్రాములు బరువు), 833 గ్రాములు వెండి వస్తువులు విరాళంగా అందజేశారు. సుమారు రూ.2.40 లక్షల విలువైన ఈ ఆభరణాలను ఆలయ సహాయ కమిషనర్ వి.వెంకటసుబ్బయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

భగవద్గీతను పాఠ్యాంశంగా చేర్చాలి

● ఆకట్టుకున్న మహాసంకీర్తన ర్యాలీ

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 18 : నగరంలోని స్టోన్‌హౌస్‌పేట గీతామందిరం నుంచి నెల్లూరు పురమందిరం వరకు ఆదివారం గీతా వైభవ ట్రస్ట్ ఆధ్వర్యంలో భగవద్గీతపై నగర ప్రజలకు అవగాహన కల్పిస్తూ మహానగర సంకీర్తన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ లక్ష్యం భగవద్గీతలోని విలువైన అంశాలను ప్రభుత్వాలు పాఠ్యాం శాలుగా చేర్చి బోధించాలన్న డిమాండ్‌ను ప్రజలకు తెలియజేసేందుకు ఈ ర్యాలీ నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ర్యాలీలో స్టోన్‌హౌస్‌పేట, ఆత్మకూరు బస్టాండ్, బోసు బొమ్మ, సీఎంఆర్ సెంటర్, గాంధీబొమ్మ, పురమందిరం వరకు కొనసాగింది. అనంతరం పురమందిరంలో గీతా వైభవ్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు షేక్.నజీర్‌బాషా ఆధ్వర్యంలో గీతా ప్రవచనాలు, గీతా కంఠస్థ పోటీలు, పారాయణం జరిగాయి. ప్రొద్దుటూరు శ్రీనటరాజ కళాక్షేత్రం మొహిద్దీన్ ఖాన్ సారథ్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు, గీతా వైభవం ట్రస్ట్ సభ్యులు, విద్యార్థులు, గీతాభిమానులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఫొటో అన్నది ప్రతిబింబం కాదు. దృశ్య రూపంలో చెప్పే కవిత్వం. కాలానికి సాక్ష్యంగా మిగిలే చరిత్ర. ఒక తాత్విక కళ. మాయాదీపం. అందాన్నీ, అందంలోని బీభత్సాన్నీ, ఆనందంలోని విషాదాన్నీ కూడా ఏకకాలంలో పటంగట్టే చూపిస్తారు ఫొటోగ్రాఫర్లు. అందుకు నిదర్శనమే ఈ ఫొటోలు. తిరుపతి నగరంలో, తిరుమల కొండ మీద, చిత్తూరు పల్లెల్లో ఆదివారం ఉదయం నుంచీ సాయంత్రం దాకా ఆంధ్రజ్యోతి కెమెరా కంటబడ్డ బతుకు చిత్రాలు ఇవి. మనసుపెట్టి చూస్తే ఎన్నో కథలు చెబుతాయి. మనల్ని కదిలిస్తాయి. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తిరుపతి, చిత్తూరు, తిరుమలలోని ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్లు వీటిని అందిస్తున్నారు.

నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ డే

జీవన చిత్రం




















రూ.1,570 కోట్ల పెట్టుబడులతో 15 పరిశ్రమలకు ప్రారంభోత్సవం

రూ.900 కోట్లతో ఏడు పరిశ్రమలకు భూమిపూజ

రూ.1,213 కోట్లతో ఐదు పరిశ్రమల స్థాపనకు ఒప్పందాలు

నేడు శ్రీసిటీకి సీఎం చంద్రబాబు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం జిల్లాలోని శ్రీసిటీ ప్రత్యేక ఆర్థిక మండలిని సందర్శించనున్నారు. ఈ సందర్భంగా రూ.1,570 కోట్ల పెట్టుబడులతో, 8,480 మందికి ఉద్యోగాలు కల్పించే స్థాయిలో ఏర్పాటైన 15 పరిశ్రమలను ప్రారంభించనున్నారు. రూ.900 కోట్ల పెట్టుబడులు, 2,740 మందికి ఉద్యోగాలు కల్పించే ఏడు పరిశ్రమలకు భూమిపూజ చేయనున్నారు. అలాగే రూ.1,213 కోట్ల పెట్టుబడితో 4,060 మందికి ఉద్యోగావకాశాలు కల్పించే మరో ఐదు పరిశ్రమల స్థాపనకు సంబంధిత ప్రతినిధులతో ఒప్పందాలు కుదుర్చుకోనున్నారు.

- సత్యవేడు

పర్యటన వివరాలిలా..

సీఎం కార్యాలయం నుంచి అందిన అధికారిక షెడ్యూలు ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ఉదయం పది గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి గన్నవరం విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ 10.40 గంటలకు విమానంలో బయల్దేరి 11.30 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి రానున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి మధ్యాహ్నం 12 గంటలకు శ్రీసిటీ వెళతారు. శ్రీసిటీలో బిజినెస్ సెంటర్ సందర్శించి మధ్యాహ్నం 2.30 వరకూ రెండు గంటల పాటు అక్కడే గడపనున్నారు. నిర్మాణం పూర్తి చేసుకున్న పరిశ్రమలను ప్రారంభించడంతోపాటు కొత్తగా ఏర్పాటు కానున్న పరిశ్రమలకు భూమిపూజ చేస్తారు. అలాగే ప్రతిపాదిత పరిశ్రమల స్థాపనకు ఆయా సంస్థల ప్రతినిధులతో ఒప్పందాలు కుదుర్చుకోనున్నారు. ఈ కార్యక్రమాలు ముగించుకుని మధ్యాహ్నం 2.40 గంటలకు శ్రీసిటీ నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి తిరుపతి విమానాశ్రయం చేరుకుని మూడు గంటలకు విమానంలో బయల్దేరి గన్నవరం తిరుగు ప్రయాణం కానున్నారు.

ప్రారంభించనున్న పరిశ్రమలు ఇవే!

శ్రీసిటీలో ఎల్జీ పాలిమర్స్, నైడెక్, ఈప్యాక్ డ్యూరబుల్స్, నియో లింక్ టెలికమ్యూనికేషన్స్, ఓజీ ఇండియా ప్యాకేజింగ్, జెన్ లైనెన్ ఇంటర్నేషనల్, బెల్ ఫ్లేవర్స్ అండ్ ఫ్రాగ్రెన్సెస్, జేజీఐ మెటల్ కన్వెర్ట్స్, త్రినాథ్ ఇండస్ట్రీస్, ఎవర్ షైన్ మౌల్డర్స్, ఆటోడేటా, ఎస్కే కాంపొనెంట్స్, అడ్మైర్ కేబుల్స్, బాంబో కోటెడ్ అండ్ స్పెషల్ స్టీల్, శ్రీలక్ష్మీ ఆగ్రో ఫుడ్స్ తదితర 15 పరిశ్రమలతోపాటు శ్రీసిటీ ఈఎంసీ ఫైర్ స్టేషన్‌ను కూడా సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు. ఈ పరిశ్రమలు ఇండియాతోపాటు జపాన్, దక్షిణ కొరియా, జర్మనీ, ఇజ్రాయెల్ తదితర దేశాలకు సంబంధించినవి.

భూమిపూజ చేయనున్నవి

బ్లూస్టార్, ఎన్సీసీ ట్రాన్స్‌మిషన్, సిద్ధార్థ లాజిస్టిక్స్, టీఐఎల్ హెల్త్ కేర్, ఏజీపీ సిటీ గ్యాస్, ఆర్ఎస్బీ ట్రాన్స్‌మిషన్, వెర్మిరెన్ రిహాబ్ తదితర ఏడు పరిశ్రమలతోపాటు హైటెక్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారు. ఈ పరిశ్రమలు మనదేశంతోపాటు జపాన్, బెల్జియం, చైనా తదితర దేశాలకు చెందినవి.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు

అధికారుల పరిశీలన

శ్రీసిటీలో ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త కిషోర్, కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం భన్సల్, ఎస్పీ సుబ్బరాయుడు పర్యటించారు. ఏర్పాట్లను పరిశీలించారు.

శ్రీసిటీకి ఆరోసారి వస్తున్న బాబు

చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో శ్రీసిటీ పర్యటనకు సోమవారం ఆరోసారి విచ్చేయనుండడం విశేషం. శ్రీసిటీ సెజ్ ఏర్పాటయ్యాక 2015 ఏప్రిల్ 3న తొలిసారి పెప్సీ పరిశ్రమ ప్రారంభానికి విచ్చేశారు. అదే రోజు శ్రీసిటీలో 11 పరిశ్రమలకు భూమిపూజ చేశారు. 2016 ఏప్రిల్ 25, 27 తేదీల్లో రెండుసార్లు వచ్చారు. మాండలెజ్, ఇసుజు పరిశ్రమల ప్రారంభోత్సవాలు చేశారు. 2018 జనవరి 9న అపోలో టైర్స్ పరిశ్రమ భూమిపూజకు, 2018 మార్చి 23న హీరో మోటార్స్ పరిశ్రమ భూమిపూజకు శ్రీసిటీకి విచ్చేశారు. ఇక వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్కసారైనా శ్రీసిటీకి రాని సీఎంగా జగన్ నిలవడం గమనార్హం.

ఐదు సంస్థలతో ఒప్పందాలు

డైకిన్, యాక్సెలెంట్ ఫార్మా, ఆర్మ్ వెస్ట్ మిర్రైటెక్ ఇండియా, క్యాప్ మ్యాన్ ఇండియా, పీఐ ప్రిస్టేజ్ ఇంటర్నేషన్ తదితర ఐదు పరిశ్రమల ఏర్పాటుకు ఆయా సంస్థల ప్రతినిధులతో ఎంఓయూలు కుదుర్చుకుంటారు. ఇవన్నీ మన దేశంతోపాటు జపాన్, సింగపూర్, ఇండోనేషియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తదిర దేశాలకు సంబంధించినవి. అనంతరం శ్రీసిటీలోని వివిధ పరిశ్రమల సీఈవోలతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు.

పటిష్ఠ బందోబస్తు

తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 18: శ్రీసిటీ పర్యటనకు సీఎంతోపాటు హోంమంత్రి వంగలపూడి అనిత, డీజీపీ ద్వారకా తిరుమలరావు వస్తుండడంతో జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేసింది. డీజీపీ ఆధ్వర్యంలో ఎస్పీ సుబ్బరాయుడు స్వీయ పర్యవేక్షణలో ముగ్గురు అదనపు ఎస్పీలు, 10 మంది డీఎస్పీలు, 20 మంది సీఐలు, 25 మంది ఎస్ఐలు, 100 మంది ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 150 మంది కానిస్టేబుళ్లు, 60 మంది రిజర్వు బలగాలు, రోప్‌పార్టీలు, డాగ్, బాంబు స్క్వాడ్‌లు బందోబస్తులో ఉన్నాయి. వీరితోపాటు కాన్వాయ్ పార్టీలో ఆరు బృందాలున్నాయి.

చంద్రబాబు 70 రోజుల పాలనలోనే.. శ్రీసిటీకి రూ.2వేల కోట్ల పెట్టుబడులు

- 6,800 మందికి ఉద్యోగావకాశాలు
- గతంలో సీఎంగా వుండగా వంద పరిశ్రమల ఏర్పాటు
- ఇపుడూ అదే చొరవ.. పట్టుదల

తిరుపతి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ముఖ్యమంత్రిగా పాలనా పగ్గాలు చేపట్టి నేటికి కేవలం 70 రోజులవుతోంది. ఈ స్వల్ప వ్యవధిలోనే జిల్లాలోని శ్రీసిటీకి రూ.2వేల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. 6,800 మంది యువతకు ఉద్యోగాలు కల్పించే అవకాశాలు ఏర్పడుతున్నాయి. గతంలో 2014-19 నడుమ సీఎంగా వున్న సమయంలో ఆయన చొరవ కారణంగా ఏకంగా వంద పరిశ్రమలు శ్రీసిటీలో ఏర్పాటైన సంగతి తెలిసిందే. తాజాగా పాలనపై పట్టు రావాలని కాలయాపన చేయకుండా అధికారంలోకి వచ్చీరాగానే సొంత జిల్లా పట్ల, ప్రత్యేకించి పారిశ్రామిక అభివృద్ధి పట్ల అదే చొరవ, పట్టుదల వ్యక్తమవుతుండడం జిల్లావాసుల్లో హర్షాతిరేకాలు నింపుతోంది. చంద్రబాబు చొరవ, పట్టుదల చూస్తుంటే రానున్న రోజుల్లో శ్రీసిటీకి తద్వారా జిల్లాకు పారిశ్రామికంగా భారీ పెట్టుబడులు, ప్రయోజనాలు సమకూరే అవకాశాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి.

సగం పరిశ్రమలు బాబు హయాంలోనే ఏర్పాటు

సత్యవేడు, వరదయ్యపాలెం మండలాల పరిధిలో నెలకొల్పిన శ్రీసిటీ ప్రత్యేక ఆర్థిక మండలిలో ప్రస్తుతం 220 పరిశ్రమలు నడుస్తున్నాయి. ఈ పరిశ్రమల ద్వారా రూ.45వేల కోట్ల పెట్టుబడులు జిల్లాకు వచ్చాయి. వీటిలో 62వేల మంది ఉద్యోగులు పని చేస్తుండగా 70 శాతం మంది రాష్ట్రానికి చెందిన వారుండగా మొత్తం మీద 40 శాతం మంది జిల్లావాసులున్నారు. శ్రీసిటీ గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏర్పాటైనప్పటికీ అందులో పరిశ్రమల స్థాపనకు 2014-19 నడుమ చంద్రబాబు ప్రభుత్వం విశేషంగా కృషి చేసింది. సొంత జిల్లా కావడంతో ఆయన శ్రీసిటీపై ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో ఆ ఐదేళ్లలో ఏకంగా వంద పరిశ్రమలు శ్రీసిటీకి తరలివచ్చాయి. వాటిలో పెప్సీకో, మాండలెజ్, ఇసుజు, ఫాక్స్ కాన్, హీరో మోటార్స్, అపోలో టైర్స్ వంటి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పరిశ్రమలు వున్నాయి. ఈ పరిశ్రమల కారణంగా పారిశ్రామిక పటంలో జిల్లా కీర్తిప్రతిష్ఠలు అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడించాయి.



ప్రారంభానికి సిద్ధమైన ఈప్యాక్ డ్యూరబుల్ కంపెనీ

అక్రమార్కులపై ఎస్పీ కొరడా

గ్రావెల్ అక్రమ రవాణాకు సహకరించిన హెడ్‌కానిస్టేబుల్, హోంగార్డు సస్పెన్షన్

చంద్రగిరి సీఐకి చార్జి మెమో

అనధికారిక జరిమానా వసూలు చేస్తున్న మరో హోంగార్డుపైనా వేటు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 18: అక్రమార్కులపై ఎస్పీ సుబ్బరాయుడు కొరడా ఝుళిపించారు. ఓ హెడ్ కానిస్టేబుల్‌తోపాటు ఇద్దరు హోంగార్డులను ఆదివారం సస్పెండ్ చేశారు. ఓ సీఐకి చార్జి మెమో ఇచ్చారు. వివరాలిలా ఉన్నాయి. చంద్రగిరి మండలంలోని గంగుడుపల్లె, మండపంపల్లె గ్రామాల సమీపం నుంచి మల్లయ్యపల్లె మీదుగా గ్రావెల్ తవ్వి టిప్పర్ల ద్వారా అక్రమంగా రవాణా చేస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు గండికొడుతూ అధికారుల కళ్లు కప్పి కొద్ది రోజులుగా జరుగుతున్న ఈ అవినీతి తంతుపై చంద్రగిరి సీఐ రామయ్యకు ఫిర్యాదులు అందాయి. ఈ విషయం బయటకు పొక్కకుండా హెడ్‌కానిస్టేబుల్ ఎస్.బసవయ్య, హోంగార్డు సుధాకర్‌లను వెంటనే గ్రావెల్ అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను అడ్డుకోవాలని ఆదేశించారు. సీఐ ఆదేశాలను వారు పట్టించుకోలేదు. మరోవైపు ఈ అంశంపై స్థానికులు కొందరు నేరుగా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. విచారణ చేసిన ఆయన గ్రావెల్ అక్రమంగా రవాణా చేస్తున్నవారికి తమ సిబ్బంది వంత పాడినట్లు నిరూపణ అయింది. దాంతో చంద్రగిరి సీఐ రామయ్యకు చార్జి మెమో జారీ చేశారు. రక్షక్ మొబైల్ హెడ్‌కానిస్టేబుల్ బసవయ్య, హోంగార్డు సుధాకర్‌ను సస్పెండ్ చేశారు. శాఖా పరమైన విచారణకూ ఆదేశించారు. అలాగే తిరుపతి ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు శ్రీనివాసులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై అనధికారికంగా జరిమానా విధిస్తున్నాడని ఎస్పీకి ఫిర్యాదు అందింది. విచారణలో అక్రమ వసూళ్లు చేస్తున్నది నిజమని తేలడంతో అతడినీ సస్పెండ్ చేశారు. పోలీసు శాఖలోని ప్రతి ఒక్కరూ ప్రజల మన్ననలు పొందేలా పనిచేయాలని ఈ సందర్భంగా ఎస్పీ పేర్కొన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడితే ఏ స్థాయి అధికారైనా ఊరుకునేది లేదని హెచ్చరించారు.

శ్రీవారు వేసే శిక్ష నుంచి తప్పించుకోలేరు

టీటీడీ ఏడీ బిల్డింగ్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తప్పు చేసిన వాళ్లు సాంకేతిక కారణాలతో చట్టం నుంచి తప్పించుకున్నా.. శ్రీవేంకటేశ్వర స్వామి వేసే శిక్ష నుంచి మాత్రం తప్పించుకోలేరని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. టీటీడీ పరిపాలన భవనంలోని ఇంజనీరింగ్ విభాగంలో జరిగిన అగ్నిప్రమాదం ఘటనను పరిశీలించడానికి ఆదివారం కూటమి నేతలతో కలసి ఎమ్మెల్యే ఏడీ బిల్డింగ్‌కు వెళ్లారు. వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గది లోపలకు వెళితే, ఆధారాలు చెరిగిపోతాయని పోలీసులు, విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఘటన మొత్తాన్ని వీడియో ద్వారా వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ శ్రీవారి పాలనా నిర్వహణకు గుండెకాయ వంటి టీటీడీ పరిపాలనా భవనంలో అగ్నిప్రమాదం జరగడం దురదృష్టకరమన్నారు. ఇంజనీరింగ్ విభాగంలోని బైపాస్ రోడ్లను పర్యవేక్షించే డీఈకి సంబంధించిన ఫైళ్లు మాత్రమే దగ్ధం కావడం పలు సందేహాలకు తావిస్తోందని చెప్పారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇంజనీరింగ్ పనుల్లో జరిగిన అవకతవకలకు సంబంధించి పలువురికి విజిలెన్స్ నోటీసులు జారీ అయిన నేపథ్యంలో ఈ ఘటన జరగడం దురదృష్టకరమని అన్నారు. పోలీసుల దర్యాప్తు కొనసాగుతోందని.. నిజానిజాలు బయట పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు, నాయకులు ఊట్ల సురేంద్ర నాయుడు, ఆర్సీ శ్రీనివాసులు, జగ్గా, లక్ష్మీ, రవి తేజా నాయుడు, జనసేన నాయకులు రాజా రెడ్డి, ఆర్కాట్ కృష్ణప్రసాద్, బాజ్జీ, వెంకటేష్, మునస్వామి, పవన్ తదితరులు పాల్గొన్నారు.



అగ్నిప్రమాదం జరిగిన గది వద్ద ఎమ్మెల్యే ఆరణి తదితరులు



మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను నాటక రూపంలో ప్రదర్శిస్తున్న వైద్య విద్యార్థులు

మహిళలకు రక్షణేదీ?

- స్విమ్స్‌లో కొనసాగుతున్న జూనియర్ డాక్టర్ల నిరసన

తిరుపతి(వైద్యం), ఆగస్టు 18: 'మహిళలకు రక్షణ లేకుండా పోతోంది. వయస్సుతో సంబంధం లేకుండా అఘాయిత్యాలు కొనసాగుతున్నాయి. చివరకు ప్రాణాలు కాపాడే మహిళా డాక్టర్లకు సైతం రక్షణ లేకపోవడం సమాజం సిగ్గుతో తలదించుకోవాల్సిన విషయం' అని స్విమ్స్‌లోని జూనియర్ డాక్టర్లు (జూడాలు) ఆవేదన వ్యక్తం చేశారు. కోల్‌కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాలలో మహిళా జూనియర్ డాక్టరుపై జరిగిన హత్యాచార ఘటనకు సంబంధించి స్విమ్స్‌లోని జూడాలు నాలుగు రోజులుగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం మహిళలకు ప్రత్యేక రక్షణ చట్టాలు తీసుకురావడంతోపాటు హత్యాచారానికి గురైన జూనియర్ డాక్టరుకు న్యాయం చేయాలని వారు ప్లకార్డులు చేతపట్టి నిరసన తెలిపారు. అనంతరం సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను కళ్లకు కట్టినట్లు చూపిస్తూ పలు నాటక ప్రదర్శనలు నిర్వహించారు. వీటిని వీక్షించిన ఆస్పత్రిలోని రోగుల సహాయకుల మనస్సు చలించి, జూడాలకు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా స్విమ్స్ ఆర్‌డీఎస్‌ఏ (రెసిడెంట్ డాక్టర్స్ అండ్ స్టూడెంట్స్ అసోసియేషన్) నేతలు డాక్టర్ ధీరజ్‌కుమార్, డాక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ.. ఇప్పటికే అనేక చోట్ల డాక్టర్లపై దాడులు జరిగిన ఘటనలు ఉన్నాయన్నారు. అయినా తమకు రక్షణ కల్పించే విధంగా ఎలాంటి చట్టాలను అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. వెంటనే ఈ ఘటనకు సంబంధించిన వారితోపాటు నిర్లక్ష్యంగా వ్యవహరించిన కళాశాల అధికారులను కూడా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

దందాలు చేసేది వైసీపీవాళ్లే: టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కోట, ఆగస్టు 18: ఐదేళ్ల పరిపాలన సాగించిన వైసీపీ నాయకులు కోట మండలంలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి దందాలకు పాల్పడ్డారని అలాంటి సంస్కృతి తమ పార్టీకి లేదని టీడీపీ నాయకులు అన్నారు. కోట పట్టణంలోని రవినగర్‌లో ఉన్న టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ నాయకులు మీడియాతో మాట్లాడారు. కోట పంచాయతీలో వైసీపీ నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరించి స్థానికులను ఇబ్బంది పెట్టారన్నారు. పంచాయతీకి చెందిన రూ.3 కోట్లను స్వాహా చేశారన్నారు. పంచాయతీ దుకాణాల విషయంలో టీడీపీ నాయకులు లాలుచీ పడ్డారని వైసీపీ నాయకులు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. తాము లేకపోతే పంచాయతీని వైసీపీలో ఉన్న కొంతమంది నాయకులు తాకట్టు పెట్టేవారన్నారు. రూ.3 కోట్ల అప్పుల నుంచి పంచాయతీని కాపాడామన్నారు. ఇలాంటి వ్యక్తులు తమపై బురదచల్లడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అదే విధంగా కోటలోని బీసీ బాలుర గురుకుల పాఠశాలలో లక్షలాది రూపాయలకు ఉద్యోగాలు అమ్ముకుని పేదల కడుపుకొట్టింది వైసీపీ నాయకులు కాదా అన్ని ప్రశ్నించారు. అభివృద్ధి కోసం పరుగులుతీసే తమ నాయకులపై ఇలాంటి ప్రచారాలు చేస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి టి. రాధాకృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు షంషుద్దీన్, ఉపాధ్యక్షుడు వి.అనిల్, ఎంపీటీసీ సభ్యుడు డి.సురేష్, మైనార్టీసెల్ నాయకులు నౌషాద్, బాబు, కార్యవర్గ సభ్యులు టి.శ్రీనివాసులు, నందా మోహన్ తదితరులున్నారు.

కోటమ్మకు పూజలు



కోట, ఆగస్టు 18 : కోట గ్రామదేవత కోటమ్మ అమ్మవారికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కోట, వాకాడు, చిట్టమూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆయా మండలాల నుంచి వచ్చిన భక్తులకు పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ముత్యాలమ్మకు...



చిల్లకూరు, ఆగస్టు 18: మండలంలోని తూర్పుకనుపూరులో కొలువై ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని అమ్మవారికి నైవేద్యం నివేదించారు. ఆలయం ఎదుట వున్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నిత్యావసరాల పంపిణీ



దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు అందజేస్తున్న జేవీవీ సభ్యులు

గూడూరు/ గూడూరు అర్బన్, ఆగస్టు 18: స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రభాకర్‌రెడ్డి దాతృత్వంతో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేవీవీ పట్టణాధ్యక్షుడు వి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... ప్రతినెలా తమ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు నిత్యావసరాలు అంది స్తున్నామన్నారు. నాగరాజు, చెంచునారాయణ, రాధయ్య, సుబ్రమణ్యం, రజినీ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు.సనత్‌కుమార్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, రాఘవరెడ్డి, కృష్ణారెడ్డి, కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



నాయుడుపేట టౌన్, ఆగస్టు 18: పట్టణంలోని జనరల్ పాఠశాలలో కంటి వైద్య ఉచిత శిబిరం జరిగింది. ఆదివారం చాగణం లలితమ్మ, భాస్కర్ రావు మెమో రియల్ ట్రస్టు ఆధ్వర్యంలో శిబిరాన్ని తిరుపతి ఎస్వీ అరవింద్ నేత్రాలయ సహకారంతో నిర్వహించారు. 150 మందికి పరీక్షలు నిర్వహించి 50 మందికి మందులను, 45 మందికి కంటి అద్దాలను ఉచితంగా అందజేశారు. 33 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కృష్ణ, దిలీప్, జగదీష్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కోటపోలూరులో...

సూళ్లూరుపేట, ఆగస్టు 18: మండల పరిధిలోని కోటపోలూరులో కేజేఆర్ చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నేత్ర వైద్య శిబిరం జరిగింది. తిరుపతికి చెందిన ఎస్వీ అరవింద్ కంటి వైద్యశాల సహకారంతో జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో జరిగిన ఈ శిబిరంలో 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 40మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. ఈ శిబిరాన్ని షార్ డిప్యూటీ డైరెక్టర్ రమేష్‌బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేజేఆర్ ట్రస్టు నిర్వాహకులు కోగిలి సురేష్ రెడ్డి, సభ్యులు రాజేష్ రెడ్డి, శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, మోహన్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

విత్త మంత్రి నిర్మలమ్మ జన్మదినోత్సవం

గూడూరు అర్బన్, ఆగస్టు 18: స్థానిక సంగం థియేటర్ సెంటర్ వద్ద ఆదివారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ పుట్టినరోజు కార్యక్రమాన్ని హీరాబెన్ మాతాజీ గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు పెంచలనాయుడు మాట్లాడుతూ... దేశ ఆర్థిక శాఖ మంత్రిగా నిర్మలా సీతారామన్ ఎనలేని సేవలను అందిస్తుందన్నారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టి, పేదలకు దుస్తులను అందజేసి, అన్నదానం చేశారు.

సర్వాయి పాపన్నగౌడ్ జయంతి



గూడూరు అర్బన్, ఆగస్టు 18: స్థానిక తాళమ్మ గుడి ఆవరణలో ఆదివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని నిర్వ హించారు. ఈ సందర్భంగా గౌడ సంఘ నాయకుడు శ్రీనివాసులుగౌడ్ మాట్లాడు తూ.. బహుజనుల కోసం పాపన్నగౌడ్ గోల్కొండ నవాబులతో అలుపెరుగని పోరాటాలు సాగించారన్నారు. అనంతరం పాపన్నగౌడ్ చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా

సూళ్లూరుపేట, ఆగస్టు 18: మండల పరిధిలోని ఆబాక గ్రామంలో ఆదివారం రాత్రి ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. సూళ్లూరుపేట నుంచి కంకర లోడ్‌తో ఏలికాడుకు వెళ్తున్న ట్రాక్టర్ ఆబాక రోడ్డు వద్ద ఎదురుగా కారు రావడంతో అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న కాలువలో బోల్తాపడింది. ఈ ప్రమాదం జరిగినప్పుడు ట్రాక్టర్‌లో డ్రైవర్, మరో ఇద్దరూ వ్యక్తులు ఉన్నారు. ఎవరికి ఏమి జరగలేదు.

ట్రాఫిక్ చిక్కుల్లో సూళ్లూరుపేట

- అడ్డదిడ్డంగా వాహనాల నిలిపివేత
- పట్టించుకోని పోలీసులు
- ఇబ్బందుల్లో ప్రజలు







బజారు వీధిలో స్తంభించిన ట్రాఫిక్ - బాపూజీ, బజారు వీధుల్లో నడి రోడ్డుపై నిలిపి ఉన్న వాహనాలు

సూళ్లూరుపేట, ఆగస్టు 18: పట్టణంలో ట్రాఫిక్‌తో నిత్యం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బజారు వీధుల్లో ద్విచక్ర వాహనాలే కాకుండా ఆటోలు, కార్లు ఎక్కడ పడితే అక్కడ నిలిపివేస్తున్నారు. బాపూజీ వీధి, కచ్చేరివీధుల్లో రోడ్డు కు అడ్డంగా వాహనాల నిలిపివేయడంతో పాదాచారులు కూడా అడుగుపెట్టలేని పరిస్థితి. పార్శిల్ లారీలు సమయపాలన లేకుండా బజారు వీధుల్లోకి రావడంతో రాకపోకల సమస్య తీవ్రమవుతోంది. పట్టించుకోవాల్సిన పోలీసులు సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారు.

పట్టణంలో బాపూజీ, కచ్చేరివీధులు ప్రధాన వ్యాపార కేంద్రాలు. నిత్యం కొనుగోలు దారులతో రద్దీగా ఉంటాయి. ఆటోలు, కార్లు బజారు వీధుల్లోకి పనుల నిమిత్తం వచ్చి నడిరోడ్డులో ఆపేసి పనులు చూసుకొని తీరిగ్గా వచ్చి తీస్తున్నారు. అత్యవసర పనులపై వెళ్లాల్సినవారికి అవస్థలు తప్పడం లేదు. శని, ఆదివారాల్లో మాంబట్టు, శ్రీసిటి సెజ్‌లో పనిచేసే ఉద్యోగులకు సెలవు దినాలు కావడంతో ఆ రెండు రోజులు బాజరు వీధుల్లో నడిచి వెళ్లాలన్న నరకం కనబడుతోంది. పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ స్తంభించిపోతున్నా పోలీసులు స్తబ్దుగా ఉండిపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల బాధ్యతలు తీసుకొన్న సీఐ ట్రాఫిక్ పై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోండి: పాశిం



రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే పాశం, నానాజీ తదితరులు

గూడూరు, ఆగస్టు 18: ఆరోగ్యం పట్ల ప్రతిఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సూచించారు. ఆదివారం సీఎస్ఎం పాఠశాలలో బుజ్జమ్మ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో చెన్నైకి చెందిన కేవీటీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్య, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా సాధించవచ్చన్నారు. గూడూరు వంటి పట్టణంలో చెన్నైకి చెందిన సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యనిపుణులు పలు విభాగాల్లో ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందించడం హర్షణీయమన్నారు. వైద్యుల సూచనలను పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. రక్తదాన శిబిరం ద్వారా సేకరించిన రక్తాన్ని ఏరియా ఆసుపత్రి బ్లడ్‌బ్యాంకుకు అందించడం ద్వారా ఆపదలో ఉన్న రోగులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఖరీదైన వైద్యపరీక్షలను శిబిరంలో అందించడం అభినందనీయమని టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ అన్నారు. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం చేయడం బాధకరమని నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. శీలం కిరణ్‌కుమార్, ఎస్.భాస్కర్‌రెడ్డి, మస్తాన్‌నాయుడు, పి.శ్రీనివాసులు, బి. చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, సర్వోత్తమరెడ్డి, ఇశ్రాయిల్‌కుమార్, ప్రణీత్, చంద్రనీల్, రత్నం, వివేకనందన్, మౌలాలి, శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రూ.10 నాణెం... వద్దేవద్దు!



తడ, ఆగస్టు 18: ఓ పక్క 10 రూపాయల నాణెం చెల్లుతుందని ఆర్‌బీఐ చెబుతున్నా.. నాణేలను తీసుకునేందుకు వ్యాపారులు నిరాకరిస్తున్నారు. చివరకు పెట్రోల్ బంకులు సైతం ఇదే పందా అవలంబిస్తున్నాయి. 10 రూపాయల నోట్ల స్థానంలో ఐదేళ్ల క్రితం రూ.10 నాణేలను ఆర్‌బీఐ అందుబాటులోకి తెచ్చింది. కొంతకాలం వాటిపై ఎటువంటి అభ్యంతరాలు లేకపోయినా రెండేళ్ల నుంచి దుకాణదారులు వాటిని తీసుకునేందుకు నిరాకరిస్తూ వచ్చారు. ఈ నాణేలు వినియోగంలోనే ఉన్నాయంటూ ఆర్‌బీఐ చెబుతున్నా వ్యాపారులు వాటిని తీసుకోవడానికి వెనకడుగు వేస్తున్నారు. ఇటీవల రూ.10 నోట్ల కొరత వచ్చింది. సూళ్లూరుపేట, తడల్లో ఆ నోట్ల కొరత ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో కొద్ది రోజుల క్రితం ఆర్‌బీఐ మరోసారి పది రూపాయల నాణేల వినియోగంపై క్లారిటీ ఇచ్చింది. వీటిని తిరస్కరించిన వారిపై చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరించింది. అయినా దుకాణ యజమానుల్లో మార్పురాలేదు. దీనికి తోడు పెట్రోలు బంకులు సైతం ఈ నాణెలను తీసుకునేందుకు నిరాక రిస్తున్నాయి. ఆది వారం సూళ్లూ రుపేట కనక దు ర్గా మహల్ సమీ పంలోని పెట్రో ల్ బంకులో కొం దరు వాహనదారులు ఆ నాణేలను ఇవ్వగా వాటిని అక్కడ సిబ్బంది తిర స్కరించడంతో వారితో వాగ్వాదానికి దిగారు. చిన్న వ్యాపారులు అవగాహన లేక నాణేలను తిరస్కరిస్తున్నారంటే వారిలో ఉన్న భయాలకు అర్థం ఉంది. కానీ కేంద్ర పెట్రోలియం సంస్థల ద్వారా నడిచే పెట్రోల్ బంకులు సైతం తిరస్కరించడం విడ్డూరంగా ఉందని వీటిపై చర్యలు తీసుకోవాలంటూ స్థానికులు కోరుతున్నారు.

దొంగ బాబాపై చర్యలు తీసుకోండి: జేవీవీ



మాట్లాడుతున్న జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పెంచలయ్య

తడ, ఆగస్టు 18: మూఢ నమ్మకాలను ప్రచారం చేస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్న ఓ దొంగ బాబాపై చర్యలు తీసుకోవాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు పెంచలయ్య కోరారు. కొండూరు పంచాయతీ సుందరపురం పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న పెంచలయ్య మాట్లాడుతూ... కృష్ణా జిల్లాకు చెందిన శేషగిరిరావు అనే స్వామి కొండూరు పంచాయతీ సుందరపురం ప్రభుత్వ భూమిని కబ్జాచేసి క్షుద్రపూజలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. తాను దేవుడితో నేరుగా మాట్లాడుతానంటూ, ప్రజల సమస్యలు, జబ్బులు నయం చేస్తానంటూ అమాయకులను మభ్యపెట్టి వేల రూపాయలను వసూలు చేస్తున్నాడన్నారు. సూళ్లూరుపేట మండలం జంగాలగుంటకు చెందిన ఓ మహిళ వద్ద వైద్యం పేరుతో రూ.7వేలు వసూలు మందులు ఇచ్చాడని అవి వికటించి ఆమె చనిపోయిన విషయం వెలుగులోకి రాకుండా చేశాడని ఆరోపించాడు. రాత్రి వేళల్లో క్షుద్రపూజలు చేస్తున్నాడని వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ తరహా దొంగ స్వాముల విషయంలో ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యవంతులుగా చేస్తున్నామన్నారు. చెంగయ్య, కృష్ణారావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్, చంద్రశేఖర్, రాజేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

15మంది స్మగ్లర్ల అరెస్టు
ఐదు గొడ్డళ్లు స్వాధీనం



పట్టుబడ్డ స్మగ్లర్లతో టాస్క్‌ఫోర్సు

మంగళం, ఆగస్టు 18: ఎర్రచందనం దుంగలకోసం అడవిలోకి చొరబడుతున్న 15మంది స్మగ్లర్లను ఆదివారం టాస్క్‌ఫోర్సు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి బ్యాగ్, పిడిలేని గొడ్డళ్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జి, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడి ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ(రిజర్వుడ్) సురేష్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో ఆర్ఎస్ఐ విశ్వనాథం బృందం తిరుపతి సమీపంలోని మంగళం నుంచి కరకంబాడి మీదుగా బాలపల్లి వైపు కూంబింగ్ చేపట్టారు. ఆదివారం ఉదయం టీఎన్‌పాలెం సెక్షన్ కరకంబాడి సమీపంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం వైపు ఉన్న నిషేధిత అటవీ ప్రాంతంలో కొంతమంది వెళుతూ కనిపించారు. వారిని చుట్టుముట్టగా కొందరు పారిపోయారు. వారిలో 15మందిని అదుపులోకి తీసుకోగలిగారు. వారిని తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై జిల్లా జమునామత్తూరుకు చెందిన అరుళ్, ఆనందన్ గోపాల్, సేతు అన్నామలై, జయమణి, చక్రవర్తి, శివలింగంరామన్, కుప్పుస్వామి కొళంధై, రంజిత్ మాణిక్యం, కుప్పన్ గోవిందన్, గోవిందరాజ్ అరుణాచలం, శిలింగం మొట్టియన్, ఏలుమలై, సంతోష్ సెల్వరాజ్, మహేంద్రన్ గోవిందన్, జ యవేలుగా గుర్తించారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసుస్టేషన్‌కు తరలించిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రఫీ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ సాగు పరిశీలన



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న విదేశీ బృందం

తిరుచానూరు, ఆగస్టు 18: తిరుపతి రూరల్ మండలం వేమూరులో అయ్యప్పనాయుడు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని ఆదివారం యూకేకు చెందిన ప్రొఫెసర్ ఫరేన్స్ సుధ్గన్ తన బృందంతో కలిసి ఆదివారం సందర్శించారు. పీఎండీఎస్ పంటలు, విత్తనాల కిట్లు, సీడ్ బాల్స్ ప్రత్యక్షంగా తయారు చేయడం, ఏటీఎం మోడల్ ఘన జీవామృతాన్ని అయ్యప్పనాయుడు ప్రత్యక్షంగా చేసి చూపించారు. ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాలను వివరించారు. **రామచంద్రాపురం:** శ్రీరామపురం, కుప్పంబాదూరు, పున్నమనాయుడుకండ్రిగ, పాలేపల్లి గ్రామాల పరిధిలోని ప్రకృతి వ్యవసాయ తోటలను విదేశీ బృందంతోపాటు ఇతర రాష్ట్రాల ప్రతినిధులు పరిశీలించారు.


ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీస్ స్టేషన్ వద్ద పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

పెళ్లకూరు, ఆగస్టు 18: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను ఎస్ఐ శ్రీకాంట్ స్వాధీనం చేసుకొన్నారు. మండలంలోని కలవకూరు సమీపంలో స్వర్ణముఖి నది నుంచి ఆదివారం రాత్రి ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడులు చేశారు. నదిలో ఇసుకను నింపుతున్న 5 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మండలంలోని కలవకూరు, కుల్లూరు, ముమ్మారెడ్డిగుంట సమీపంలోని స్వర్ణముఖి ఇసుక తరలుతోంది

తిరుమల బాలాజీనగర్‌లో విస్తృత తనిఖీలు



బాలాజీనగర్‌వాసులతో మాట్లాడుతున్న విజిలెన్స్, పోలీసు అధికారులు

తిరుమల, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): తిరుమలలో వరుసగా జరుగుతున్న సంఘటనల నేపథ్యంలో విజిలెన్స్, పోలీసు అధికారులు ఆదివారం తనిఖీలు చేపట్టారు. అత్యంత రద్దీ ప్రదేశమైన నందకం వద్ద పట్టపగలు ఇద్దరు హాకర్లు గాజుబాటిళ్లతో ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటూ రక్తగాయాలతో వీరంగం సృష్టించి భక్తులను భయభ్రాంతులకు గురిచేసిన విషయం తెలిసిందే. తిరుమలలో నిషేధిత మద్యం, పొగాకు ఉత్పత్తులు కూడా లభిస్తున్నాయనే సమాచారం నేపథ్యంలో భద్రతను పెంచేందుకు, అనధికార వ్యక్తులను గుర్తించి తరలించాలని టీటీడీ సీవీఎస్వో శ్రీధర్ ఆదేశించారు. ఈమేరకు విజిలెన్స్ వీఎస్వో సురేంద్ర ఆధ్వర్యంలో విజిలెన్స్, పోలీసులు అధికారులు, సిబ్బంది బాలాజీనగర్‌లో పాచికాల్వ గంగమ్మ ఆలయానికి సమీపంలో కూలీలు ఏర్పాటు చేసుకున్న షెడ్లపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. గతంలో తిరుమలలో వివిధ నిర్మాణ పనుల్లో కూలీలుగా పనిచేసిన వారి కోసం తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేశారు. పనులు పూర్తయినా చాలా మంది ఇప్పటికీ 70పైగా షెడ్లలో నివాసముంటున్నట్టు అధికారులు గుర్తించారు. ఇందులో గుర్తింపులేని అనధికార వ్యక్తులు కూడా ఉన్నట్టు తేలింది. ఈక్రమంలో కార్మికుల జాబితాను ధ్రువీకరణ కోసం ఇంజినీరింగ్ విభాగానికి కూడా పంపారు. అనధికారికంగా ప్రవేశించే వారిని నిలువరించేందుకు ఇకపై ఇలాంటి డాడులు నిరంతరాయంగా నిర్వహిస్తామని టీటీడీ అధికారులు తెలిపారు. అనధికారికంగా నివసిస్తున్న వ్యక్తులు, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలు



నిర్మానుష్యంగా ఉన్న ఆర్టీసీ బస్టాండు రోడ్డు

గూడూరు, ఆగస్టు 18: వారం రోజులుగా ఎండవేడిమి పెరగడంతో ఉక్కపోతకు ప్రజలు అల్లాడిపోతున్నారు. వేసవికాలం ముగిసినా ఎండల తీవ్రత తగ్గక పోవడంతో ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఉదయం 7గంటల నుంచే ఎండ తీవ్రత మొదలై సాయంత్రం 5గంటల వరకు కొనసాగుతోంది. దీంతో ప్రజలు పనుల నిమిత్తం బయటకు రావాలంటే ఇబ్బంది పడుతున్నారు. మధ్యాహ్నం సమయంలో ప్రధాన రహదారుల సైతం నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారి పది నిమిషాల పాటు వర్షం కురిసినా తిరిగి ఎండ తీవ్రత అధికమైంది. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ఎండ తీవ్రతంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రెండు ద్విచక్రవాహనాల ఢీ: ఒకరి మృతి



రామకృష్ణారెడ్డి మృతదేహం

తడ, ఆగస్టు 18: రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. మండల పరిధిలోని కారిజాత గ్రామానికి చెందిన డి.రామకృష్ణారెడ్డి (60) మాంబట్టు అపాచీ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఆదివారం విధులకు హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. మార్గమధ్యంలో మాంబట్టు సెజ్ రోడ్డు మలుపు తిరుగుతుండగా తడ నుంచి సూళ్లూరుపేట వైపుకు వెళ్తున్న మరో బైక్ ఆయన్ను ఢీనింది. ఈ ప్రమాదంలో రామకృష్ణారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని సూళ్లూరుపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరించారు. దీంతో రామకృష్ణారెడ్డి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి వివాహిత ఆత్మహత్య



శివాని (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, ఆగస్టు 18: సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం నవజీవన్ ఎక్స్‌ప్రెస్ కిందపడి సూళ్లూరుపేట పట్టణం నాగరాజపురానికి చెందిన శివాని (25) ఆత్మహత్య చేసుకుంది. శివాని కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది చెన్నై నుంచి అహ్మదాబాద్‌కు వెళ్లే నవజీవన్ రైలు కిందపడి ఆత్మహత్యకు చేసుకుందిన మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ కే.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి..

గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందాడు. సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ దక్షిణ వైపున చెన్నై వైపు వెళ్లే రైలు కిందపడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడికి సంబంధించిన వివరాలేవి తెలియరాలేదు. సుమారు 45 సంవత్సరాలు వయస్సు ఉంటుంది. మృతదేహంపై నీలిరంగు చొక్కా, నీలిరంగు గళ్లల లుంగీ ఉన్నాయి. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎదురెదురుగా ఢీకొని కాలి బూడిదైన బైకులు



కోట, ఆగస్టు 18: మండలంలోని చంద్రశేఖరపురం వద్ద ఆదివారం రెండు మోటరు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు బైక్‌ల్లో మంటలు చెలరేగి కాలిపోయాయి. చిట్టేడు గ్రామానికి చెందిన కె. పార్వతయ్య, అంకమ్మ కోట నుంచి బైక్‌లో చిట్టేడుకు వస్తున్నారు. చిట్టమూరు మండలం మెట్టు గ్రామానికి చెందిన మహేష్, శ్రీనివాసులు గూడూరు నుంచి విద్యానగర్ వైపు వస్తున్నారు. ఈ రెండు మోటరు బైక్‌లు చంద్రశేఖరపురం వద్ద ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో పార్వతయ్యకు కాలువిరిగిపోగా, మహేష్, శ్రీనివాసులుకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వీరిని 108 అంబులెన్స్‌లో గూడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బైక్‌ల ఇంజన్లు పూర్తిగా కాలిపోయాయి.

బైక్‌ను ఢీ కొన్న కారు: ఇద్దరికి గాయాలు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 18: పట్టణంలోని అమరావతి సెంటర్ వద్ద బైక్‌ను కారు ఢీ కొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. దొరవారిసత్రం మండలానికి చెందిన సుబ్రహ్మణ్యం, మునస్వామి మోటరు సైకిల్‌పై ఆదివారం నాయుడుపేటకు వస్తుండగా అమరావతి సెంటర్‌వద్ద కారు ఢీకొనింది. ఈ ప్రమాదంలో సుబ్రహ్మణ్యం, మునస్వామి గాయ ప డ్డారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకొని క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రేషన్ బియ్యం స్వాధీనం



నాయుడుపేట టౌన్, ఆగస్టు 18: పట్టణంలోని పడమటివీధి, వెంకటగిరి రోడ్డు సమీపంలో 2,750 కిలోల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్ట ణంలోని పడమటివీధిలో మినీ వ్యాన్‌లో 1,750 కిలోల రేషన్ బియ్యం తరలించేందుకు సిద్ధం చేస్తుండగా పోలీసులకు సమాచారం అందింది. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బియ్యం సహా మినీ వ్యాన్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రంగయ్య, ప్రవీణ్‌రెడ్డి, హుస్సేన్‌పై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. అలాగే వెంకటగిరి రోడ్డు సమీపంలో నిల్వ ఉంచిన వెయ్యి కిలోల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని వెంకటేష్, శ్రీనివాసులుపై కేసు నమోదు చేశారు.